జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా

సంపుటి - 07 | సంచిక 329 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 31, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

శ్రీ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న వాసం వెంకటేశ్వర్లు ఐఏఎస్

వరంగల్, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని వాసం వెంకటేశ్వర్లు, ఐఏఎస్., శుక్రవారం ఉదయం సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ భద్రకాళీ అమ్మవారికి వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మహామండపంలో ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు, అర్చకులు ఆయనకు మహదాశీర్వచనం నిర్వహించారు. ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

సైబర్ నేరాల నివారణకు అవగాహన, అప్రమత్తతే కీలకం

వరంగల్ సీపీ ఎన్. శ్వేత, ఐపీఎస్

వరంగల్, అక్టోబర్ 30(జై భీమ్ క్రైమ్ న్యూస్)



సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి అప్రమత్తం చేయడమే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్లాష్ వాక్ నిర్వహించారు. కేయూ జంక్షన్ నుంచి హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో కలిసి ఫ్లాష్ వాక్‌లో నడిచారు. వివిధ కళాశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ ఎన్. శ్వేత మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, నకిలీ సందేశాలు, మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాలపై తాము పొందిన అవగాహనను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకుని సమాజంలో సైబర్ భద్రతపై చైతన్యం తీసుకురావాలని సీపీ పిలుపునిచ్చారు. ఫ్లాష్ వాక్ ద్వారా "అప్రమత్తతే సైబర్ మోసాలకు అడ్డుకట్ట" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ డివిజన్ల ఇన్‌స్పెక్టర్లు, హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సైబర్ క్రైమ్ ఎస్ఐలు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా

సంపుటి - 07 | సంచిక 329 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 31, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

ప్రజల అణిచివేతే.. ప్రాణాంతక ముప్పు!

డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

- ప్రజలను అణిచివేస్తున్న పాలకులు పుట్టగతులు లేకుండా పోతారు
- దమాక్ లేనోళ్లు దరిద్రులు
- నీతిలేనోళ్లు దేశం గురించి మాట్లాడుతున్నారు
- కఠినంగా వ్యవహరించాలంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు
- దేశంలో జరుగుతున్న పద్ధతి లేని రాజకీయాలతో ప్రజలు విసిగిపోతున్నారు
- బ్రిటిష్ పాలకులు అణిచివేతకు మోడీ పాలన అణచివేతకు పెద్ద తేడా ఏమీ లేదు
- ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రజల మీదకు రెచ్చగొడుతున్నాడు
- ధర్నాలంటే భయపడుతున్న కేంద్ర ప్రభుత్వం
- అయోధ్య రామాలయంలో దొంగతనం ఎందుకు చేశారంటే "మా"ఇష్టం అంటారు
- దేశ ప్రజలను ఎందుకిలా నాశనం చేస్తున్నారంటే సమాధానం చెప్పారు
- జ్ఞానేష్ కుమార్ తప్పులకు కారకులు ఎవరంటే మాకు తెలవదు అంటారు
- రోడ్లపై ధర్నాలు చేస్తున్న వ్యక్తులు ధమాక్ నక్సలైట్ల !
- పద్ధతి లేకుండా దేశాన్ని పాలించే నాయకులను ఏమనాలి దేశద్రోహులు అంటే సరిపోతుందా !
- డాక్టర్ బరిగెల శివ

ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతును అణిచివేయడం పాలకులకు ప్రాణాంతక ముప్పుగా మారుతుందని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, నిరసనలు తెలపడం ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమించే విద్యార్థులు, మేధావులు, ప్రజాసంఘాలపై ముద్రలు వేయడం సరికాదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని నక్సలైట్లు, అర్బన్ నక్సలైట్లు అంటూ పిలవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనల సందర్భంగా ఆంక్షలు, నిరసనకారులపై చర్యలపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. బ్రిటిష్ పాలనలోని అణచివేతను గుర్తు చేసేలా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు సంధించారు. ప్రజల సమస్యలకు సమాధానాలు చెప్పాల్సిన పాలకులు విమర్శలను సహించలేకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ప్రజా సమస్యలపై ప్రభుత్వాలు జవాబుదారీతనంతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కులను గౌరవిస్తూ రాజ్యాంగ విలువలను కాపాడాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు. ని

- హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

2

పదవులు లేకున్నా పోరాడాను... ఒక్క అవకాశం ఇస్తే ప్రజల కోసం నిలబడతాను!

16 ఏళ్ల మీడియా ప్రస్థానం... 12 ఏళ్ల జై భీమ్ పోరాటం... రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం!

నా ప్రయాణాన్ని చూడండి... నా పోరాటాన్ని గుర్తించండి... ఒక్కసారి ఆలోచించండి!

బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కుల స్ఫూర్తితో, సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా మీ ముందుకు వస్తున్నాను.

4

విద్యార్థులపై రగులుతున్న అధికారుల "పగ"

- అంతా ఆమె చేతిలోనే ఉంది అంటున్న వీసీ రిజిస్ట్రార్
- మేము సానుకూలమే ఆమె ఒప్పుకోవడం లేదు
- ఆమెను ఒప్పించుకుంటే మాకు అభ్యంతరం లేదు
- మేము ఉన్నది అవినీతి అక్రమాలను పెంచి పోషించడానికిగాని విద్యార్థులను ఆదుకోవడానికి కాదు.!
- స్థానిక నాయకులకు పట్టింపు లేదా..
- ఈసీ మీటింగ్ 154.14లో విద్యార్థులకు వ్యతిరేకంగా రాసిన బేవర్స్ "గాడిద" ఎవడు
- ఏఆర్ కోల శంకర్ రాసాడు అంటున్న రిజిస్ట్రార్
- అంతా అధికారులకే తెలుసు నాకేం సంబంధం లేదంటున్న కోల శంకర్
- కేయూ అధికారుల నటనకు ఆస్కార్ అవార్డులు ఇచ్చిన తక్కువే
- విద్యార్థుల జీవితాలతో చెలగాటలాడితే పుట్టగతులు ఉండవు
- ఏ అధికార పదవైన శాశ్వతం కాదు పైగా ఎవని అబ్బ సొత్తు కాదు
- అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కేయూ అధికారులు
- అడ్డుదారులో కమిటీ వేసి రాష్ట్ర విద్యా కార్యదర్శి యోగితరాణపై నిందలు వేస్తున్నారు
- అక్రమార్కులకు అండగా నిలవడం కోసమే విద్యార్థులను వేధిస్తున్నారు

4

రూ.11 వేల ఇంజెక్షన్.. రూ.1.30 లక్షల బిల్లు!

క్యాన్సర్ మందుల ధరలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

ప్రాణాపాయంలో ఉన్న రోగుల నిస్సహాయతను సొమ్ము చేసుకుంటారా?

ఔషధాల ధరల నియంత్రణపై కేంద్రానికి సూటి ప్రశ్నలు

2

రూ.1.50 లక్షల కోట్ల భూములు కాపాడాం

హైదరాబాద్, అక్టోబర్ 30 (కొత్త స్వరం):

తెలంగాణలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మియాపూర్‌లోని 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని తెలిపారు. మియాపూర్ భూ వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై లంచాలు, అక్రమ లావాదేవీలకు సంబంధించి ఆరోపణలు చేశారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని భూములతో పాటు పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను గతంలో ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించడంతో పాటు హరీశ్‌రావు మామ హన్మంతరావుపైనా భూ ఆక్రమణ ఆరోపణలు చేశారు. ప్రభుత్వ భూముల విక్రయం ద్వారా వచ్చే నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నామని, ఈ ప్రతిపాదనను మంత్రివర్గం ముందుంచనున్నట్లు తెలిపారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, అభివృద్ధి పనులను గుర్తిస్తుందని చెప్పారు.

రూ.11 వేల ఇంజెక్షన్.. రూ.1.30 లక్షల బిల్లు!

క్యాన్సర్ మందుల ధరలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
ప్రాణాపాయంలో ఉన్న రోగుల నిస్సహాయతను సొమ్ము చేసుకుంటారా?
ఔషధాల ధరల నియంత్రణపై కేంద్రానికి సూటి ప్రశ్నలు

న్యూఢిల్లీ, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

ప్రాణాలు కాపాడాల్సిన వైద్యం వ్యాపారంగా మారుతోందా? క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్న రోగులపై మందుల ధరల భారం ఎంతవరకు మోపాలి? ఒకవైపు చికిత్స ఖర్చులు భరించలేక కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతుంటే, మరోవైపు ఔషధాల కొనుగోలు ధరకు, ఆసుపత్రుల్లో రోగులకు వసూలు చేస్తున్న ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

రూ.11 వేల ఇంజెక్షన్‌కు రూ.1.30 లక్షలా?

క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే కీమోథెరపీ ఇంజెక్షన్ డీలర్ ధర రూ.11,000 కాగా, ఒక ప్రైవేట్ ఆసుపత్రి అదే ఇంజెక్షన్‌కు రూ.1.30 లక్షలు వసూలు చేసిందనే ఉదంతాన్ని సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా ప్రస్తావించింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న తన భార్యకు చికిత్స చేయించేందుకు ప్రయత్నించిన ఓ ఔషధ పంపిణీదారుడికి ఎదురైన అనుభవం కోర్టు దృష్టికి వచ్చింది. ఈ ధరల వ్యత్యాసాన్ని ఎలా సమర్థించుకుంటారని, రోగుల నుంచి ఇంత భారీ మొత్తాన్ని ఎందుకు వసూలు చేస్తున్నారని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఆసుపత్రుల నిర్వహణకు ఖర్చులు ఉన్నప్పటికీ, వాటి పేరుతో ప్రాణరక్షక మందుల ధరలను విపరీతంగా పెంచడం సమర్థనీయం కాదనే అభిప్రాయాన్ని ధర్మాసనం వ్యక్తం చేసింది.

మందుల ధరలపై కేంద్రానికి ప్రశ్నలు

జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఔషధాల ధరల నియంత్రణ, ఆసుపత్రులు వసూలు చేస్తున్న అదనపు మార్జిన్లపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఔషధాల కొనుగోలు ధరకు, రోగులకు విధిస్తున్న ధరకు మధ్య ఇంత భారీ వ్యత్యాసం ఎందుకు ఉంటోందని నిలదీసింది. మందుల ధరలను నియంత్రించేందుకు ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలు సరిపోతున్నాయా? మరిన్ని ఔషధాలను ధరల నియంత్రణ పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందా? అనే అంశాలపై విచారణ సందర్భంగా చర్చ జరిగింది. ఔషధ ధరల నియంత్రణకు సంబంధించిన పిటిషన్లపై వాదనలు విన్న ధర్మాసనం తన నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది.

రోగుల ప్రాణాలా? వ్యాపార ప్రయోజనాలా?

క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే ఖరీదైన మందులు అనేక కుటుంబాలకు తీవ్ర ఆర్థిక భారంగా మారుతున్నాయి. దీర్ఘకాలిక చికిత్స, పరీక్షలు, ఆసుపత్రి ఖర్చులతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు మందుల ధరల్లో భారీ వ్యత్యాసాలు మరింత భారాన్ని పెంచుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణ ఖర్చులు, మందుల నాణ్యత, సరఫరా భద్రత వంటి అంశాలను ఆసుపత్రుల తరఫు న్యాయవాదులు ప్రస్తావించినప్పటికీ, వాటి పేరుతో రోగులపై అధిక ధరల భారం మోపడం ఎంతవరకు సమంజసమనే అంశాన్ని ధర్మాసనం పరిశీలించింది. సామాన్యులకు అందుబాటులోకి రావాలి వైద్యం. ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్న రోగులకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండటం అత్యంత అవసరం. ఔషధాల ధరల్లో పారదర్శకత, ఆసుపత్రుల బిల్లుల్లో స్పష్టత, ధరల నియంత్రణ వ్యవస్థ సమర్థవంతంగా అమలవడం ద్వారా రోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించే అవకాశం ఉంది. వైద్యం కొనగలిగిన వారికే పరిమితం కాకూడదు. ప్రాణాలు కాపాడే మందులు సామాన్యులకు అందుబాటులో ఉండేలా ధరల నియంత్రణ వ్యవస్థ బలోపేతం కావాలి. సుప్రీంకోర్టు విచారణలో లేవనెత్తిన ప్రశ్నలు ఔషధ ధరల విధానంపై విస్తృత చర్చకు దారితీశాయి.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఆందోళనకు బీఎస్పీ మద్దతు

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి
హెల్త్ కార్డులు అందించాలి - బీఎస్పీ నాయకులు

పోచమ్మ మైదాన్, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో ఎన్‌హెచ్‌ఎం (జాతీయ ఆరోగ్య మిషన్) ఉద్యోగులు చేపట్టిన ధర్నాకు బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ పార్లమెంట్ ఇన్‌చార్జి బస్కె నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు వనం మహేందర్ హాజరై ఉద్యోగుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వనం మహేందర్ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, వారు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ప్రజారోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలకంగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా రోడ్లపైకి వచ్చే పరిస్థితి కల్పించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. బహుజన్ సమాజ్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఉద్యోగులు తమ హక్కుల కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేసే పరిస్థితి ఉండదని వ్యాఖ్యానించారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు జన్ను అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వసుకుల ప్రవీణ్, జిల్లా కోశాధికారి పూలేపాక లోకేష్, జిల్లా కార్యదర్శి ఆకులపల్లి బాబు, చింత శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల “అణిచివేతే”ప్రాణాంతక ముప్పు

ప్రజలను అణిచివేస్తున్న పాలకులు పుట్టగతులు లేకుండా పోతారు
దమాక్ లేనోళ్లు దరిద్రులు
నీతిలేనోళ్లు దేశం గురించి మాట్లాడుతున్నారు
కఠినంగా వ్యవహరించాలంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు
దేశంలో జరుగుతున్న పద్ధతి లేని రాజకీయాలతో ప్రజలు విసిగిపోతున్నారు
బ్రిటిష్ పాలకులు అణిచివేతకు మోడీ పాలన అణచివేతకు పెద్ద తేడా ఏమీ లేదు
ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రజల మీదకు రెచ్చగొడుతున్నాడు
ధర్నాలంటే భయపడుతున్న కేంద్ర ప్రభుత్వం
అయోధ్య రామాలయంలో దొంగతనం ఎందుకు చేశారంటే “మా”ఇష్టం అంటారు
దేశ ప్రజలను ఎందుకిలా నాశనం చేస్తున్నారంటే సమాధానం చెప్పారు
జ్ఞానేష్ కుమార్ తప్పులకు కారకులు ఎవరంటే మాకు తెలవదు అంటారు
రోడ్లపై ధర్నాలు చేస్తున్న వ్యక్తులు ధమాక్ నక్సలైట్ల !
పద్ధతి లేకుండా దేశాన్ని పాలించే నాయకులను ఏమనాలి దేశద్రోహులు అంటే సరిపోతుందా !
డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

దేశాన్ని సమర్థవంతంగా పాలించలేని నాయకులు దేశంలోని ఉద్యమకారులపై అక్కాసు వెళ్లగక్కుతున్నారని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు. నిరసనలు తెలపడం దేశ ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కని అలాంటి హక్కులను కాలరాస్తూ ఉద్యమకారులను బేధించడం కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అణిచివేత కుట్రలను మేధావులు ఉద్యమకారులు ప్రజా సంఘాలు తీవ్రస్థాయిలో తిప్పికొడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టిలో దమాక్ నక్సలైట్స్ అర్బన్ నక్సలైట్స్ అనేవాళ్ళు ఎవరో కేంద్ర ప్రభుత్వం బిజెపి పార్టీలో అలాంటివాళ్లు ఎంతమంది ఉన్నారో లెక్కలేసుకోవాలని సూచించారు. ఉత్తరప్రదేశ్ లోని అయోధ్య రామాలయంలో దొంగతనం జరిగితే ఇప్పటికీ లెక్కలు చూపించండి అంటే మా ఇష్టం మా ఆలయం మేము దొంగతనాలు చేసుకుంటామంటూ బహిరంగంగా మాట్లాడుతున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తనకు తాను గొప్ప మహానుభావుని లాగా భావించుకుంటూ జాతీయ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎలాంటి తప్పు చేయకపోయినా రాజీనామా చేయించారంటూ సాకులు మాట్లాడుతుండడం సిగ్గు కరంగా ఉందన్నారు. పేపర్ లీకులతో నీట్ విద్యార్థుల ప్రాణాలను బలికొన్న విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరిన మేధావులను తప్పుపడుతూ విద్యార్థి మేధావులపై విరుచుకుపడుతున్న యోగి అయోధ్య రామాలయంలో జరిగిన 100కు పైన దొంగతనాలకు బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ రక్షణ కోసం పోరాటం చేస్తున్న విద్యార్థి మేధావులు నక్సలట్లయితే ధమాక్ లేకుండా మాట్లాడుతూ దేశాన్ని పాలిస్తున్న నాయకులను తీవ్రవాదుల్లాగా భావించాలి అంటూ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతి రాజకీయ నాయకునికి, ప్రతిపౌరునికి భారత రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని వాళ్లు సామాన్య ప్రజలైన రాజకీయ నాయకులైన అధికారులైన చట్టపరిధిలో న్యాయస్థానాల పరిధిలో అన్నిటికన్నా మించి భారత రాజ్యాంగ పరిధిలో సమానమేనని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అక్రమాలకు పాల్పడకపోతే దేశ ప్రజలు దేశంలోని మేధావులు జంతర్మంతర్ ప్రాంతానికి చేరి కేంద్రంపై లక్షల సంఖ్యలో ధర్నాలు చేస్తూ ఎందుకు తిరగబడతారంటూ నిలదీశారు. పోలీసుల భయానికో, ఆరోగ్యానికి క్షీణించిపోయో, భారత రాజ్యాంగం ప్రభావమో తెలియదు గాని నిజమైన నక్సలైట్లుగా పిలవబడే వ్యక్తులందరూ ప్రభుత్వాలకు లొంగిపోయారని చాలామంది వ్యక్తులను అన్ని ప్రభుత్వాలు ఎన్కౌంటర్లు చేశాయని ప్రస్తుతం దేశవ్యాప్తంగా నక్సలిజం అనే పదం వినపడకుండా పోయిందని అట్టి విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సక్సెస్ అయినామని ప్రకటించుకుంటున్న సందర్భంలో దేశ ప్రజలను ధమాక్ నక్సలైట్స్ అంటూ, అర్బన్ నక్సలైట్స్ అంటూ, పేర్లు పెట్టడం దరిద్రంగా ఉందన్నారు. దరిద్రమైన ఆలోచనలతో దేశాన్ని పాలించడమే కాకుండా దేశంలోని ప్రజా ఉపయోగకరమైన వ్యవస్థను అన్నిటిని నాశనం చేస్తూ ప్రశ్నిస్తున్న దేశ ప్రజలపై ప్రశ్నిస్తున్న దేశ ఉద్యమకారులపై ప్రశ్నిస్తున్న దేశం మేధావులపై ప్రశ్నిస్తున్న దేశ విద్యార్థులపై ప్రశ్నిస్తున్న దేశ ఉద్యోగులపై ధమాక్ నక్సలైట్స్ అని పేరు పెట్టి పిలిచే స్థాయికి చేరిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ తన 12 సంవత్సరాల దేశ పాలనపై దేశ ప్రజలకు చేసిన ఉపయోగాలను మేలులను శ్వేతపత్రం రూపంలో విడుదల చేసి తన నిజాయితీని కనపరచుకోవాలని డిమాండ్ చేశారు.

అణిచివేతే అంతమొందిస్తుంది జాగ్రత్త..

బిజెపి పాలిత ప్రాంతాల్లో ప్రజలను దిక్కులేని వాళ్ళుగా చేస్తూ ఓట్లు వేసిన ప్రజలను అణిచివేస్తూ ధర్నాలు చేస్తున్న వ్యక్తులపై దారుణమైన దాడులకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యంలో ప్రజలను గాని ఉద్యమకారులను గాని విద్యార్థులు గాని ప్రతిపక్ష రాజకీయ పార్టీలను గాని ఎంతలా అణిచివేస్తే అంతలా అంతమైపోతారంటూ సూటిగా హెచ్చరించారు. ఢిల్లీ జంతర్మంతర్ ప్రాంతంలో అక్టోబర్ 10న జరిగిన మహాధర్నాలో కేంద్ర ప్రభుత్వం చట్టాలకు విరుద్ధంగా న్యాయస్థానాలకు విరుద్ధంగా తీసుకున్న నిర్ణయాల పట్ల ఏ కేంద్ర ప్రభుత్వ నాయకుడు సమాధానం చెప్తాడో ఇప్పటికీ దిక్కు లేదన్నారు. రైళ్లు రద్దు చేయబడ్డాయి, మెట్రో స్టేషన్లు మూసి వేయబడ్డాయి, నిరసనకారులు గృహ నిర్బంధంలో ఉంచబడ్డారు, రహదారులు మూసివేయబడ్డాయి, అర్ధ సైనిక బలగాలు మోహరించబడ్డాయి, ఆర్ఎస్ఎస్ గుండాలు ధమాక్ నక్సల్స్ అర్బన్ నక్సల్స్ రూపంలో మారణాయుధాలతో మేధావులపై రత్తాలు కారేలా దాడులకు దిగారు, ఢిల్లీ ప్రాంతంలోని అన్ని ప్రధాన హోటల్లో తనిఖీలు నిర్వహించబడ్డాయి, ఢిల్లీ సరిహద్దు వద్ద ప్రతి ప్రధాన ప్రాంతంలో గార్డులు మోహరించబడ్డారు, వైన్స్ షాపులు మూసివేయబడ్డాయి, ఇంటర్నెట్ సౌకర్యాలు నిలిపివేయబడ్డాయి ఈ విధంగా ప్రస్తావిస్తూ నిజవాస్తవాలను వెలుగులోనికి తీసుకువచ్చే క్రమంలో కేంద్ర ప్రభుత్వం అవలంబించిన అణిచివేత విధానం బ్రిటీష్ పాలకులను తలపించిందని మండిపడ్డారు. ప్రజలకు రక్షణ కల్పిస్తామంటూ ప్రగల్బాలు పలికిన కేంద్ర ప్రభుత్వ నాయకులు దేశంలోని మేధావులను చితకబాదిన సంఘటనలు ప్రపంచ దేశాలలో కనువిప్పు కలిగేలా చేశాయని బాధ వ్యక్తం చేశారు. ఉద్యమకారులపై కఠినంగా వ్యవహరించాలని మాట్లాడుతున్న ప్రధాన నేతలందరూ 2014 ముందు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో జంతర్మంతర్ ప్రాంతంలో ఎన్ని ధర్నాల నిర్వహించారరో ఒక్కసారి జ్ఞాపకం చేసుకోవాలని హెచ్చరించారు. ముఖ్యంగా గ్యాస్ సిలిండర్ ధర నిరసనలో మహిళా బిజెపి నేతలు డాన్సులు వేశారన్నా సంగతిని మర్చిపోకూడదన్నారు. మైకు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేకలు వేస్తూ పాకిస్తాన్ కా రుపియ నై గిర్తి, శ్రీలంక కా రుపియ నై గిర్తి బాంగ్లాదేశ్ కా రుపియా నై గిర్తి ఔర్ క్యా కారన్ హే హిందుస్థాన్ కా రుపియ పతలా హో రహా హై అంటూ రెచ్చిపోయి సరిగ్గా 12 సంవత్సరాల కాలంలో దేశంలో రూపాయి విలువను పూర్తిగా దిగజార్చారని మండిపడ్డారు. దేశాన్ని పాలిస్తున్న పాలకులకు దేశం పైన ప్రేమ గాని అభిమానం గాని అనురాగం గానీ ఏ మాత్రం లేవని వాటిని క్రియల రూపంలో చూపిస్తూ మాటల రూపంలో దేశ ప్రజలపై మమకారం చూపిస్తున్నట్లు ప్రేమానురాగాలను ఒలకబోస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పాలనలో మాటలకు చేతలకు ఏమాత్రం పొంతన కుదరడం లేదని ప్రతి రాష్ట్రంలోని ముఖ్యమంత్రి మొదలుకొని కేంద్ర మంత్రుల వరకు ఆఖరికి వాళ్ళ పిల్లలతో సహా వ్యాపార రంగాల్లో చేరిపోయి దేశాన్ని దోచుకుంటున్నారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం హాయంలో అవినీతి క్షేత్రస్థాయిలో పెరిగిపోవడానికి బలమైన కారణం కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పులేనంటూ వివరించారు.

దేశమేధావులపై దాడికి దిగుతున్న యోగి..

మోడీజీ మారాలి కఠిన నిర్ణయాలే శరణ్యం! అంటూ రెచ్చగొడుతున్నాడు. అయోధ్య రామాలయంలో వందకు పైగా దొంగతనాలు జరగడానికి కారణాలు తెలుపమంటే మా ఆలయం మా ఇష్టం ఏమైనా దొంగతనాలు చేసుకుంటాం ఎవడు అడగకూడదు అంటూ రెచ్చిపోతున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి కేంద్ర విద్యాశాఖ మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై విరుచుకుపడుతూ రాజీనామా చేయడం తప్పంటూ నీట్ విద్యార్థుల ప్రాణాలకు విలువ లేకుండా చేశారన్నారు. తప్పు లేకపోయినా సరే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. కానీ, అది నేను తప్పు అని భావిస్తున్నాను అంటూ రెచ్చిపోయారన్నారు. ఎందుకంటే, ఈ రోజుల్లో మంచిదనాన్ని కొందరు చేతకానితనంగా భావించి, రోడ్లపైకి వస్తున్నారంటూ మాట్లాడుతూనే రోడ్లపై గంటల తరబడి సామాన్య ప్రజలను వేధిస్తూ మరణ యుగాలతో దాడులు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటలాడుతున్న ఆర్ఎస్ఎస్ గుండాలు చేస్తున్న ఆగడాలపై మాట్లాడమంటే ముక్కున వేలేసుకుంటున్నాడంటూ యోగిని సూటిగా నిలదీశారు. మొన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు కాబట్టి, ఈ రోజు ఈసీ కమిషన్ రాజీనామా అడుగుతున్నారు. రేపు మోడీ రాజీనామా చేయాలని ధర్నాచేస్తారేమో?నని పలుకుతున్న యోగి తన రాష్ట్రంలో లక్షల కొద్ది ఓట్లు దొడ్డి దారిన ఏవిధంగా చేర్చబడ్డాయో సుప్రీంకోర్టులో వేయబడిన కేసులో ఆధారంగా ఆధారాలు బయటపడినప్పుడు ఉత్తరప్రదేశ్ ఎన్నికల బాగోతాలు బయటపడక తప్పదు హెచ్చరించారు. ఢిల్లీ ప్రభుత్వ భవనం పై అంతస్తులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పరిపాలన ఆధారాలు ఉన్నపాటుగా ఎందుకు కాల్చివేయబడినాయో, పశ్చిమ బెంగాల్ ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ లో 4 వేల ఈవీఎం మిషన్లు ఎందుకు దగ్ధమయ్యాయో యోగికే తెలియాలన్నారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన నాయకులను రాజీనామా చేయమనడానికి వీరికి హక్కు ఎక్కడిది? అంటూ మాట్లాడుతున్న యోగి సర్ ప్రక్రియ విధానంపై సుప్రీంకోర్టులో వేయబడిన కేసులకు తనే స్వయంగా సమాధానం చెబుతూ తన నిజాయితీని తన జవాబుదారితనాన్ని దేశ ప్రజలకు తెలియజేయాలన్నారు. మాట వినని మూర్ఖులకు, మారని మనుషులకు మనం మంచి గురించి వివరించలేము అంటూ మాట్లాడుతున్న యోగిఅ దేశ ప్రజల ప్రాణాలను తీస్తున్న మూర్ఖులెవరో దేశ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని నాయకుల మాటలు వినని ప్రజలను ఏ విధంగా చిత్రహింసలు పెడుతున్నారో దేశ ప్రజలు చూస్తున్నారు అన్నారు. తులసి వనంలో ఒక్క గంజాయి మొక్క ఉన్నా వనం మొత్తం పాడైపోయినట్టుగా ఉంటుందంటూ మాట్లాడుతున్న యోగి అసలు కైతే గంజాయి వనంలో తులసి మొక్కలకు స్థానం ఎక్కడ ఉందో తన పార్టీలోని నాయకులతో పాటు ఇతర పార్టీలలో నుండి తన పార్టీలోకి చేర్చుకోబడిన అవినీతి నాయకుల లెక్కలను గంజాయి తులసి మొక్కలతో పోలుస్తూ ఎవరు గంజాయి మొక్కలో ఎవరు తులసి మొక్కలో దేశ ప్రజలకు తెలపాలన్నారు. దేశంలో ఇలా రోడ్లపైకి వచ్చి సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వ్యక్తులు ఉంటే, మిగిలిన వారు కూడా చెడిపోయే ప్రమాదం ఉంది అంటూ కేంద్ర ప్రభుత్వానికి సూచనలు ఇస్తున్న యోగి దేశపాలకులు దేశ ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకోకుండా ప్రజాభివృద్ధి కొరకు పాటుపడినట్లయితే దేశ ప్రజలు రోడ్లపై ఎందుకు వస్తారు అంటూ సూటిగా నిలదీశారు. దేశంలో పెరిగిపోయిన అప్పులు నిత్యవసరాలు ధరల రేట్ల పెంపకాలపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకున్నప్పుడు ప్రజలకు ఉంటుంది కదా అంటూ హితవు పలికారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తూ దేశాన్ని కాపాడుకుంటున్న విద్యార్థులను చట్టపరంగా శిక్షించాలి ఎవరు పడితే వాళ్ళు రోడ్లపైకి వచ్చి ఇష్టారాజ్యంగా ధర్నాలు చేసే హక్కు ఇవ్వకూడదు అంటూ మాట్లాడుతున్న యోగి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో రోడ్లపై చిందులు వేస్తూ రోడ్లపై గంతులు వేస్తూ రోడ్లపై మారణాయుధాలతో గంటలు గంటలు డీజెలు పెట్టుకొని డాన్సులు వేస్తూ దేశ ప్రజలకు అసౌకర్యాలను కల్పిస్తున్న వ్యక్తులు ఎవరో ఒక్కసారి సోషల్ మీడియా ఓపెన్ చేసుకొని చూస్తే నివ్వెరపోగలవంటూ నిలదీశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్న సందర్భాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలి అంటూ కేంద్ర ప్రభుత్వానికి సూచనలు ఇస్తున్న యోగి అసలుకైతే దేశ ప్రజల బాగోగులు పట్టించుకోకుండా సంపన్న దేశాన్ని దరిద్రంగా మార్చిన ఘనులెవరో గుర్తించి మెదులుకోవాలని దేశంలోని ప్రజలను అణిచివేయడం ప్రాణాంతకముప్పులాంటిదంటూ హెచ్చరిస్తూ దేశాన్ని రక్షించుకోవడంలో మేధావులంతా తనముకలైపోయారని కేంద్ర ప్రభుత్వం కాదు కదా వాళ్ళ బాబులు కూడా మేధావులతో పెట్టుకొని నెగ్గలేరన్న సంగతిని మర్చిపోకూడదన్నారు.

పరిశోధన రంగంలో విశిష్ట సేవలకు ప్రొఫెసర్ గాదే సమ్మయ్యకు అరుదైన గౌరవం

శాస్త్రీయ కృషికి గుర్తింపుగా జీవితకాల సభ్యత్వ పురస్కారం ప్రదానం

హనుమకొండ, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

పరిశోధన రంగంలో విశిష్ట సేవలు, శాస్త్రీయ కృషి, విజ్ఞాన వ్యాప్తికి అందించిన తోడ్పాటుకు కాకతీయ విశ్వవిద్యాలయం ఔషధ విజ్ఞాన కళాశాలకు చెందిన ప్రొఫెసర్ గాదే సమ్మయ్యకు ప్రతిష్ఠాత్మక జీవితకాల సభ్యత్వ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థలో అక్టోబర్ 30న నిర్వహించిన విజ్ఞాన శాస్త్రం, సాంకేతికత, సమాచార వ్యాప్తి అకాడమీ వార్షిక మహాసభ--2026లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ మిశ్ర ధాతు నిగమ్ ఛైర్మన్, నిర్వహణ సంచాలకుడు డాక్టర్ ఎస్.వి.ఎస్. నారాయణమూర్తి చేతుల మీదుగా ప్రొఫెసర్ సమ్మయ్య పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వ భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ టి. శ్రీనివాస కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ సంచాలకుడు డాక్టర్ ప్రకాశ్ కుమార్, మాజీ కణ జీవశాస్త్ర పరిశోధనా కేంద్రం సంచాలకుడు డాక్టర్ ఎన్. చి. మోహన్ రావుతో పాటు పలువురు ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. పరిశోధన రంగంలో చేసిన విశేష కృషి, శాస్త్రీయ సేవలు, విజ్ఞానాన్ని ప్రజలకు చేరువ

చేయడంలో అందించిన తోడ్పాటును గుర్తిస్తూ ప్రొఫెసర్ గాదే సమ్మయ్యకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ గుర్తింపు పట్ల పలువురు శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, తోటి అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో స్వర్ణ గర్జన!

జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన లాలాపేట్ విద్యార్థిని పాలంపల్లి మోక్ష శ్రీ
70వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అద్భుత ప్రతిభ.. స్వర్ణ పతకంతో మెరిసిన బాలిక!

సికింద్రాబాద్,అక్టోబర్ 29: (జై భీమ్ న్యూస్)

ప్రతిభకు పట్టుదల తోడైతే విజయం వరిస్తుందనే విషయాన్ని లాలాపేట్‌కు చెందిన విద్యార్థిని పాలంపల్లి మోక్ష శ్రీ మరోసారి నిరూపించింది. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడమే కాకుండా, జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించి తన విజయ ప్రస్థానంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మోక్ష శ్రీ తన అసాధారణ ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకాన్ని సాధించింది. రాష్ట్రస్థాయి వేదికపై తన సత్తా చాటుతూ లాలాపేట్ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది.

స్వర్ణ పతకం వెనుక కృషి.. జాతీయస్థాయే తదుపరి లక్ష్యం!

క్రీడల్లో విజయం సాధించడం అనేది కేవలం ప్రతిభతోనే సాధ్యమయ్యేది కాదు. నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యంపై ఏకాగ్రత విజయానికి పునాదులుగా నిలుస్తాయి. మోక్ష శ్రీ సాధించిన ఈ విజయం వెనుక ఆమె కృషి, సాధనతోపాటు కోచ్‌లు, తల్లిదండ్రుల ప్రోత్సాహం కీలక పాత్ర పోషించి ఉంటాయి. రాష్ట్రస్థాయిలో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందడం ఆమె క్రీడా ప్రయాణంలో ఒక గొప్ప ముందడుగు. జాతీయస్థాయి వేదికపై కూడా ఇదే స్ఫూర్తితో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

విద్యార్థులకు స్ఫూర్తిగా మోక్ష శ్రీ విజయం!

మోక్ష శ్రీ సాధించిన ఘనత ఇతర విద్యార్థులకు, ముఖ్యంగా క్రీడలపై ఆసక్తి ఉన్న బాలికలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేందుకు సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు కల్పిస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరనే విషయాన్ని ఈ విజయం చాటిచెబుతోంది. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురాగలరు. లాలాపేట్ విద్యార్థిని పాలంపల్లి మోక్ష శ్రీ సాధించిన స్వర్ణ పతకం స్థానికంగా ఆనందాన్ని నింపగా, ఆమె జాతీయస్థాయి పోటీల్లోనూ విజయకేతనం ఎగురవేయాలని పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో స్వర్ణం.. జాతీయస్థాయిలో విజయమే లక్ష్యం!

పాలంపల్లి మోక్ష శ్రీకి హృదయపూర్వక అభినందనలు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి క్రీడా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిద్దాం.

పదవులు లేకున్నా పోరాడాను... ఒక్క అవకాశం ఇస్తే ప్రజల కోసం నిలబడతాను!

16 ఏళ్ల మీడియా ప్రస్థానం... 12 ఏళ్ల జై భీమ్ పోరాటం... రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం!
నా ప్రయాణాన్ని చూడండి... నా పోరాటాన్ని గుర్తించండి... ఒక్కసారి ఆలోచించండి!
బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కుల స్ఫూర్తితో, సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా మీ ముందుకు వస్తున్నాను.

హైదరాబాద్ ఆగస్టు 30 (జై భీమ్ న్యూస్)

గత 16 సంవత్సరాలుగా మీడియా రంగంలో పనిచేస్తూ, గత 12 సంవత్సరాలుగా జై భీమ్ టీవీని స్థాపించి, అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, అణగారిన వర్గాల సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నాను. ఈ ప్రయాణంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎన్నో ఒత్తిళ్లు వచ్చాయి. అనేక సవాళ్లను ఎదుర్కొన్నాను. అయినా నా అడుగులు ఆగలేదు. ఎందుకంటే నా లక్ష్యం వ్యక్తిగత ఎదుగుదల మాత్రమే కాదు... సమాజంలో అణగారిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలి, ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం దక్కాలి, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించాలి! ఏ రాజకీయ పదవీ లేకుండానే వందలాది మందికి అండగా నిలబడేందుకు నా వంతు ప్రయత్నం చేశాను. పగలూ రాత్రీ తేడా లేకుండా ప్రజల సమస్యలపై స్పందిస్తూ, అవసరమైన వారికి సహాయం చేస్తూ, ఆపదలో ఉన్నవారికి 'నేనున్నాను' అనే భరోసా కల్పించేందుకు కృషి చేశాను. నా చేతిలో అధికారం లేకపోయినా ప్రజల కోసం నిలబడాలనే ఆలోచన ఉంది. నా వెనుక పెద్ద రాజకీయ పార్టీ లేకపోయినా ప్రశ్నించే ధైర్యం ఉంది. నన్ను నడిపించే రాజకీయ వారసత్వం లేకపోయినా అంబేద్కర్ ఆశయాలే నాకు స్ఫూర్తి!

దేశ ప్రధాని స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రుల వరకు... నా పోరాటం ఆగలేదు!

దేశ ప్రధాని స్థాయి నాయకుడిపైనా పోటీ చేశాను. తెలంగాణలో కేసీఆర్, రేవంత్ రెడ్డి వంటి ముఖ్యమంత్రులపైనా పోటీ చేశాను. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కుల స్ఫూర్తితో రాజకీయంగా ప్రశ్నించే మార్గాన్ని ఎంచుకున్నాను. నాకు పెద్ద రాజకీయ అండ లేకపోయినా, ఆర్థిక బలం లేకపోయినా, రాజకీయ వారసత్వం లేకపోయినా పోటీ చేయడానికి వెనుకాడలేదు. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో పోటీ చేసే హక్కు కొద్దిమందికే పరిమితం కాదు. సామాన్యుడికి సైతం తన ఆలోచనలను ప్రజల ముందు ఉంచే హక్కు ఉంది. రాజ్యాంగం కల్పించిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రజా సమస్యలపై నా గొంతుకను వినిపించాలనుకున్నాను. ఒక్కసారి ఆలోచించండి... ఏ పదవీ లేకుండానే దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రుల స్థాయిలో పోటీ చేయడానికి వెనుకాడని నేను... పట్టభద్రుల ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే ప్రజల తరఫున ఇంకెంత బలంగా ప్రశ్నించగలనో ఆలోచించండి!

రాజ్యాధికారం మన హక్కు... ప్రశ్నించడం మన బాధ్యత!

బాబాసాహెబ్ అంబేద్కర్ మనకు అందించిన రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదు. అది మన హక్కులకు రక్షణ కవచం. మన సమానత్వానికి పునాది. మన ఆత్మగౌరవానికి ప్రతీక. ప్రజాస్వామ్యంలో మన గొంతుక వినిపించడానికి మార్గదర్శకం. అంబేద్కర్ ఆశయాలను కేవలం జయంతులు, వర్ధంతులకే పరిమితం చేయకుండా, ఆయన కలలుగన్న సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం కోసం మనం కార్యరంగంలోకి దిగాలి. రాజకీయ అధికారం ప్రజల సమస్యలకు పరిష్కారాలు సాధించడానికి, హక్కులను కాపాడడానికి, అణగారిన వర్గాలకు న్యాయం చేయడానికి ఉపయోగపడాలి. మన సమాజానికి ప్రశ్నించే తత్వం అవసరం. తప్పును తప్పని చెప్పే ధైర్యం అవసరం. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే నాయకత్వం అవసరం. మన ఓటు మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మన ప్రాతినిధ్యం మన సమస్యలకు బలాన్ని ఇస్తుంది. మన ఐక్యత మన హక్కుల పరిరక్షణకు పునాది అవుతుంది.

పట్టభద్రులారా... మేధావులారా... ఒక్కసారి ఆలోచించండి!

మన సమస్యలను మండలిలో ప్రశ్నించే గొంతుక మనకు అవసరం లేదా? నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలను ప్రస్తావించే నాయకత్వం అవసరం లేదా? విద్యావంతుల హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం పోరాడే వ్యక్తికి అవకాశం ఇవ్వకూడదా? ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకత్వం కావాలా? లేక పదవులు లేకపోయినా ప్రజల మధ్య ఉండి, ప్రజల సమస్యలపై స్పందించే నాయకత్వాన్ని ప్రోత్సహించాలా? ఇతరులకు ఓటు వేయడం తప్పు కాదు. కానీ మన సమాజానికి ప్రాతినిధ్యం వహించే నాయకత్వం గురించి ఆలోచించకుండా, మన సమస్యలను పక్కనపెట్టి నిర్ణయం తీసుకోవడం మాత్రం ఆలోచించాల్సిన విషయం. ఇప్పటివరకు ఎన్నో అవకాశాలు ఇతరులకు ఇచ్చాం. ఈసారి మన సమస్యలను అర్థం చేసుకునే, ప్రశ్నించే తత్వం ఉన్న, సామాజిక న్యాయం కోసం పనిచేయాలనే సంకల్పం ఉన్న అభ్యర్థులను కూడా పరిశీలించండి.

నాకు ఒక్క అవకాశం ఇవ్వండి... నా కార్యాచరణతో నిరూపించుకునే అవకాశం కల్పించండి!

నేను మీ ముందుకు కేవలం ఓట్ల కోసం రావడం లేదు. నా ప్రయాణాన్ని మీ ముందు ఉంచుతున్నాను. నా పోరాటాన్ని మీకు వివరిస్తున్నాను. నా ఆలోచనలను మీతో పంచుకుంటున్నాను. గత 16 సంవత్సరాల మీడియా అనుభవం... గత 12 సంవత్సరాల జై భీమ్ పోరాటం... ప్రజల కోసం చేసిన నా ప్రయత్నాలు... ఇవన్నీ పరిశీలించి మీరు ఆలోచనాత్మకమైన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాను. నాకు పదవి వస్తేనే ప్రజల కోసం పనిచేస్తానని కాదు... పదవి లేకపోయినా ప్రజల కోసం పనిచేయడానికి ప్రయత్నించాను. ఇప్పుడు ప్రజల తరఫున మరింత బాధ్యతగా పనిచేసే అవకాశం కోరుతున్నాను. మీరు నాకు అవకాశం ఇస్తే పట్టభద్రుల సమస్యలను ప్రస్తావించేందుకు, నిరుద్యోగుల హక్కుల కోసం పోరాడేందుకు, సామాజిక న్యాయం కోసం ప్రశ్నించేందుకు, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు నా వంతు కృషి చేస్తాను.

నాకు కావాల్సింది కేవలం రాజకీయ గుర్తింపు కాదు... ప్రజల గొంతుకగా నిలిచే అవకాశం!

నాకు కావాల్సింది వ్యక్తిగత అధికారం కాదు... ప్రజల సమస్యలను ప్రశ్నించే బాధ్యత! నాకు కావాల్సింది కేవలం ఒక పదవి కాదు... అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగస్వామ్యం అయ్యే అవకాశం! జై భీమ్ నినాదం బలపడాలి... అంబేద్కర్ ఆశయం ముందుకు సాగాలి! జై భీమ్ అనేది కేవలం ఒక నినాదం కాదు. అది ఆత్మగౌరవానికి ప్రతీక. సమానత్వానికి సంకేతం. సామాజిక న్యాయం కోసం సాగే పోరాటానికి స్ఫూర్తి. ఆ నినాదం మరింత బలపడాలి. అంబేద్కర్ ఆలోచనలు ప్రతి విద్యావంతుడి మనసులో ప్రతిధ్వనించాలి. రాజ్యాంగ విలువలు ప్రతి పౌరుడి జీవితంలో ఆచరణలోకి రావాలి. పట్టభద్రులారా... మీ ఓటు విలువను గుర్తించండి. మీ హక్కులను గుర్తించండి. మీ సమాజ భవిష్యత్తు గురించి ఆలోచించండి. నల్గొండ--వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్న నాకు మీ ఆలోచనాత్మక మద్దతు, ప్రోత్సాహం, సహకారం అందించాలని వినమ్రంగా కోరుతున్నాను. పదవి లేకున్నా పోరాడాను... అధికారం లేకున్నా ప్రశ్నించాను... ఆర్థిక బలం లేకున్నా ప్రయాణం ఆపలేదు... ఇప్పుడు ప్రజల మద్దతుతో మరింత బాధ్యతగా పనిచేసే అవకాశం కోరుతున్నాను! మన ఓటు మన హక్కుల కోసం! మన గొంతుక మన సమాజం కోసం! మన పోరాటం సామాజిక న్యాయం కోసం! మన లక్ష్యం అంబేద్కర్ ఆశయాల సాధన కోసం! జై భీమ్! జై భారత రాజ్యాంగం! – డా. బరిగెల శివ, నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి జై భీమ్ టీవీ ఫౌండర్ ఛ చైర్మన్ । ప్రజాదరణ పార్టీ వ్యవస్థాపకులు.

సైబర్ నేరాల అవగాహనపై కదం తొక్కిన సీపి

ప్రజారక్షణకు ప్రతిక్షణం సేవలందిస్తున్నారు.
సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన, అప్రమత్తతే కీలకం.
సీపీ సేవలు ఆస్వాదిస్తూ గర్వపడుతున్న ప్రజలు.
వరంగల్ సీపీ ఎన్.శ్వేత, ఐపీఎస్

వరంగల్ పోలీస్ కమిషనరేట్ జై భీమ్ న్యూస్ :-

సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించి, వారిని అప్రమత్తం చేయాలనే లక్ష్యంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈరోజు కేయూ జంక్షన్ నుంచి హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు "ఫ్లాష్ వాక్" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో కలిసి నడిచారు. వివిధ కళాశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా, సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, నకిలీ సందేశాలు, మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు తమకు కలిగిన అవగాహనను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకుంటూ సమాజంలో సైబర్ భద్రతపై చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. ఫ్లాష్ వాక్ ద్వారా విద్యార్థులు సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అప్రమత్తతే సైబర్ మోసాలకు అడ్డుకట్ట అనే సందేశాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఏసీబీ వెంకటరమణ, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, హన్మకొండ ఏసిపి నరసింహారావు, ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ, హనుమకొండ డివిజన్, వరంగల్ డివిజన్ లకు చెందిన ఇన్స్పెక్టర్ లు, హన్మకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు, సైబర్ క్రైమ్ ఎస్ఐలు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నూతన కమిటీకి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి భరోసా
రెండో తేదీన సీఎం, వేం నరేందర్ రెడ్డితో సమస్యలపై చర్చిస్తా

హనుమకొండ,30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. పార్ట్‌టైం అధ్యాపకుల నూతన అసోసియేషన్ కమిటీ సభ్యులు శుక్రవారం ఉదయం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు పార్ట్‌టైం అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ అధ్యాపకుల సమస్యలను సంబంధిత నేతలు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. నవంబర్ 2వ తేదీన వేం నరేందర్ రెడ్డితో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను వివరించి, పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపారు. నూతన కమిటీ సభ్యులు ఉత్సాహంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఎదురయ్యే సమస్యలను సమన్వయంతో అధిగమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే సైతం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సమావేశంలో చీఫ్ అడ్వైజర్ డా. ఓ. మోహన్, అధ్యక్షుడు డా. కె. రాజేందర్, ప్రధాన కార్యదర్శి కె. నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డా. వాణిదేవి, కన్వీనర్ డా. టి. భాగ్యమ్మ, కోశాధికారి డా. టి. మౌనిక, ఆర్గనైజేషన్ సెక్రటరీ డా. పి. మహేందర్, ఉపాధ్యక్షులు డా. టి. జోష్న, డా. ఆర్. శ్యాంసుందర్ చారి, డా. బి. సుధీర్, కార్యవర్గ సభ్యులు డా. రాజేంద్రప్రసాద్, డా. బండి శీను, డా. బి. రామ్మోహన్, సంయుక్త కార్యదర్శులు డా. సద్గుణ, డా. యశోదర, డా. పి. శ్రీనివాస్, ప్రజాసంబంధాల అధికారి హరికుమార్‌తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా తైక్వాండో పోటీలకు కాకతీయ యూనివర్సిటీ జట్లు

పురుషుల విభాగంలో ఆరుగురు
మహిళల విభాగంలో నలుగురు క్రీడాకారుల ఎంపిక

కేయూ క్యాంపస్, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయ పురుషులు, మహిళల తైక్వాండో జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ ఎంపికల్లో వివిధ బరువు విభాగాల నుంచి పురుషుల జట్టుకు ఆరుగురు, మహిళల జట్టుకు నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డా. శాస్త్రి వెల్లడించారు.ఎంపికైన పురుషుల జట్టు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఉన్న వివేకానంద గ్లోబల్ యూనివర్సిటీలో నిర్వహించనున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయ తైక్వాండో పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది.అదేవిధంగా మహిళల జట్టు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడాలో ఉన్న శారదా యూనివర్సిటీలో నిర్వహించనున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయ తైక్వాండో పోటీల్లో పాల్గొననుందని అంతర్ కళాశాలల క్రీడా పోటీలతోపాటు ఎంపికల బాధ్యులు డా. కుమార్ తెలిపారు.విశ్వవిద్యాలయ స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను స్పోర్ట్స్ బోర్డు అధికారులు అభినందించారు. రాబోయే పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కాకతీయ విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నవంబర్ 23న ప్రతిజ్ఞ దివస్‌ను విజయవంతం చేయాలి

కాకతీయ యూనివర్సిటీలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ
విద్యార్థులు, స్వేరోస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి - ఎల్తూరి సాయికుమార్

కేయూ క్యాంపస్, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

నవంబర్ 23, 2026న కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం ఎదుట నిర్వహించనున్న ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, కార్యక్రమ కన్వీనర్ ఎల్తూరి సాయికుమార్ పిలుపునిచ్చారు.శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రం ప్రాంగణంలో ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ.. స్వేరో స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 23న నిర్వహించనున్న ప్రతిజ్ఞ దివస్‌కు విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, విద్య పట్ల అవగాహన, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమ విజయవంతానికి స్వేరోస్ నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వేరోస్ నాయకులు, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు, పీపీఎల్ నాయకులు, కార్యక్రమ కో-కన్వీనర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , రాజనాల శ్రీహరి పిలుపు
సమీక్ష ఐఏఎస్ అకాడమీ పోస్టర్ ఆవిష్కరణ

హనుమకొండ, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులు పోటీ పరీక్షల శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.సమీక్ష ఐఏఎస్ అకాడమీ పోస్టర్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు సరైన ప్రణాళికతో పట్టుదలగా చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విద్యార్థులు అందుబాటులో ఉన్న శిక్షణ అవకాశాలను వినియోగించుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సమీక్ష ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్లు డాక్టర్ కె. వాసు, ఏ. ప్రవీణ్ కుమార్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై రగులుతున్న అధికారుల "పగ"

అంతా ఆమె చేతిలోనే ఉంది అంటున్న వీసీ రిజిస్ట్రార్.
మేము సానుకూలమే ఆమె ఒప్పుకోవడం లేదు.
ఆమెను ఒప్పించుకుంటే మాకు అభ్యంతరం లేదు.
మేము ఉన్నది అవినీతి అక్రమాలను పెంచి పోషించడానికిగాని విద్యార్థులను ఆదుకోవడానికి కాదు.!
స్థానిక నాయకులకు పట్టింపు లేదా......
ఈసీ మీటింగ్ 154.14లో విద్యార్థులకు వ్యతిరేకంగా రాసిన బేవర్స్ "గాడిద" ఎవడు .
ఏఆర్ కోల శంకర్ రాసాడు అంటున్న రిజిస్ట్రార్.
అంతా అధికారులకే తెలుసు నాకేం సంబంధం లేదంటున్న కోల శంకర్.
కేయూ అధికారుల నటనకు ఆస్కార్ అవార్డులు ఇచ్చిన తక్కువే.
విద్యార్థుల జీవితాలతో చెలగాటలాడితే పుట్టగతులు ఉండవు.
ఏ అధికార పదవైన శాశ్వతం కాదు పైగా ఎవని అబ్బ సొత్తు కాదు.
అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కేయూ అధికారులు.
అడ్డదారులో కమిటీ వేసి రాష్ట్ర విద్యా కార్యదర్శి యోగితరాణపై నిందలు వేస్తున్నారు.
అక్రమార్కులకు అండగా నిలవడం కోసమే విద్యార్థులను వేధిస్తున్నారు.



Prof. V. Ramchandram
Registrar

KAKATIYA UNIVERSITY
VIDYARANYAPURI
WARANGAL – 506 009

Fax: 0870 – 2438800 E-mail: kakatiya@ap.nic.in Phones: Off: 0870 – 2438866

No. 1005 /B3/KU/2025 Date: 24 /07/2025

ORDERS

Sub: Ph.D. Admissions – Directions of the TGCHE and State Commissioners for SC/ST/BC Commissions, Govt. of Telangana to consider certain unsuccessful candidates in the Ph.D. Entrance Test 2021-2022 for admission to Ph.D. program as supernumerary seats as one time measure – Constitution of Committee to provide information in the matter – Orders – Issued.

Ref: Minutes of the 154th meeting of the Executive Council held on 17/06/2025

~|~

In pursuance of the decision taken by the Executive Council at its 154th meeting held on 17th June 2025, the Vice-Chancellor has accorded approval to constitute a Committee with the following members to provide information on the directions of the TGCHE and State Commissioners for SC/ST/BC Commissions , Government of Telangana to consider certain unsuccessful candidates in the Ph.D. Entrance Test 2021-2022 for admission to Ph.D. programs as Supernumerary seats as one time measure:

1. Prof. B. Suresh Lal ... Chairman
Member, Executive Council, KU
2. Prof. G. Hanumanthu ... Member
Dean, Faculty of Science, KU
3. Prof. M. Srinivas ... Member
Dean, Faculty of Law, KU
4. Prof. K. Rajender ... Member
Dean, Faculty of Commerce & Business Management, KU
5. Sri Ch. Pranay Kumar ... Convener
Assistant Registrar, College Development Council, KU

The Committee is requested to submit its report within a week i.e., on or before 31st July 2025.

REGISTRAR

To
The Persons concerned.
Copy to:-
1) The Secretary to Vice-Chancellor, KU
2) The PA to Registrar, KU
3) The SF



Telangana Council of Higher Education
(A Statutory Body of the Government of Telangana)

PROF SRIRAM VENKATESH
SECRETARY

Lr.No.1401/TGCHE/UMS/2014/KU Ph.D Admn./2024 Date:22.03.2025

To
The Registrar,
Kakatiya University,
Warangal.

Sir,

Sub: TGCHE – UMS – Ph.D Admissions – Representation of certain unsuccessful candidates of Ph.D Entrance Test 2021-22 for admission into Ph.D. Program – Reg.

Ref: [illegible]

[illegible] the reference 5th cited above, you have been forwarded two lists vide references 2nd and 3rd consists of 33 candidates for Ph. D Admission who have appeared for the University Ph.D.Entrance Test 2021-22 for admission under Category-II and could not get seat due to dearth of vacancies despite of extending their validity against the vacancies existing and arising upto 31.03.2024. Basing on the Revised Rules and Regulations for the Ph.D. Programme in tune of UGC (Minimum Standards and Procedures for award of Ph.D Degree) Regulations 2022 and its latest amendments issued in No.F.4-19 UGC-NET Review Committee 20249 NET) 140648, March 27, 2024/7 brought into force from the academic year 2024-25 and admissions were also made against the vacancies for the year 2024-25 while considering the unsuccessful candidates of Ph.D. Admissions 2021-2022 and requested their plea for admission into Ph.D. Program on supernumerary basis.

In view of the above, I am by direction to request the Registrar, Kakatiya University to examine the eligibility of 33 candidates vide references 2nd and 3rd submitted by the University and consider them for admission into Ph.D programme as per the eligibility condition laid down by the University as one time measure.

Yours faithfully,

హైదరాబాద్ జై భీమ్ డెస్క్ :

గత మూడు సంవత్సరాలుగా కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ ఆశావాహ విద్యార్థులకు న్యాయం చేస్తామని నమ్మబల్కుతూ విద్యార్థులను నట్టేట ముంచుతున్న కేయూ అధికారులకు వరల్డ్ రికార్డ్ అబద్దాలకోటలో ఎన్ని ఆస్కార్ అవార్డులు ఇచ్చినా తక్కువేనని విద్యార్థులు అవహేళన చేస్తున్నారు. అక్రమార్కులకు అవినీతిపరులకు అండగా నిలవడం కోసం కేయూ అధికారులు పడుతున్న తాపత్రయం ఊహ కందనిదిగా ఉందంటూ విద్యార్థులు నిలదీస్తున్నారు. కమిటీ ఎందుకు వేసారని విద్యార్థులు ఇంచుమించు 1000 సార్లు అధికారులను అడగగా మాకు సంబంధం లేదు కమిటీ యోగితరాణ వేసింది అంటూ తప్పించుకొని చేతులు దులుపుకుంటున్న వీసీ రిజిస్ట్రార్ వాళ్ల అధికార హోదా బాధ్యతను మరిచి అధికారం అడ్డం పెట్టుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటాలు ఆడుతున్నట్లుగా స్పష్టంగా కనిపిస్తుంది. నిజానికైతే కమిటీని వేయడానికి ప్రధాన కారణం ఈసీ మీటింగ్ 154.14 పాయింట్ ఆధారంగా పాలకమండలి సమావేశంలో విద్యార్థులకు వ్యతిరేకంగా రాసుకొని షీల్డ్ కవర్లో దాచుకొని ఎవరికీ కనిపించకుండా ఈసీ మీటింగ్ ముందు ఎజెండాను తెరవడం జరిగిందంటూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం చాలాసార్లు ఆశవాక విద్యార్థులతో పాటు జర్నలిస్టులకు తెలియజేయడం జరిగింది. అలా ఎందుకు రాయాల్సి వచ్చింది అంటూ నిలదీసిన విద్యార్థులకు సమాధానం చెప్పకుండా మేము సానుకూలంగా ఉన్నాం రాష్ట్ర విద్యా కార్యదర్శి యోగితరణ మాత్రమే మీకు వ్యతిరేకంగా ఉందంటూ వీసీ, రిజిస్ట్రార్లు, వందలసార్లు అబద్ధాలాడుతూ యూనివర్సిటీ పరిధిలోని రెండు గేట్ల మధ్యలో ఉన్నటువంటి అంశాన్ని విశ్వవిద్యాలయాల చట్టపరంగా ఇక్కడే పరిష్కరించాల్సింది పోయి విద్యా కార్యదర్శి వైపు నెట్టివేస్తూ విద్యార్థులను చిత్రహింసలు పెడుతున్నారు. అనేక సందర్భాల్లో రిజిస్ట్రార్ రామచంద్రం పీహెచ్డీ సూపర్ న్యూమరరీ ఆశావాహక విద్యార్థుల విషయం అనేసరికి సునాయాసంగా దాటి వేస్తూ తప్పించుకుంటున్నాడు. అకాడమిక్ సెనేట్ ఆధారంగా స్టాండింగ్ కమిటీ డీన్స్ కమిటీ ప్రిన్సిపల్స్ కమిటీ 32 మంది విద్యార్థులకు సూపర్ న్యుమరరీ కోటా కింద సీట్లు కేటాయించాలంటూ అంగీకరించడమే కాకుండా ఎజెండాను అమలుపరచి స్వతహాగా సంతకాలు చేసి సుమారుగా రెండు సంవత్సరాలు గడుస్తుండగా సమస్యను సాగదీస్తూ విద్యార్థులను వేధిస్తూ వాళ్ళ ఉసురు పోసుకుంటూ విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి పరువును నిలువునా ముంచుతున్నారని విద్యార్థులు మండిపడుతున్నారు. అధికారులకు అక్రమాలతో కూడిన అవినీతితో కూడిన పనులను పాలకమండలి సమావేశంలో పెట్టి ఆమోదించుకోవడం కోసం ఎలాంటి భేషరతులు లేకుండా పాలకమండలి సభ్యులంతా సంతకాలు పెడుతూ సమావేశాలను ముగించుకుంటుండగా ప్రతి సమావేశంలో మినిట్స్ పై సంతకాలు చేస్తున్న విద్యా కార్యదర్శి యోగితరాణ కేయూ అధికారులు పెడుతున్న ప్రతి ఫైల్ పై సంతకాలు చేస్తూ విద్యార్థుల విషయాలకు వచ్చేసరికి ఎందుకు వేధిస్తున్నారానేది ఎవరికి అంత చిక్కడం లేదు. పైగా కమిటీ వేసిన లేఖలోనే విద్యార్థులకు వన్ టైం మీజర్ కింద సీట్లు కేటాయించాలని వీసి రిజిస్ట్రార్లతో వేయబడిన కమిటీలోనే తెలిపినప్పటికీ కమిటీ సభ్యులు మాత్రం ఒకరిని మించి మరొకరు విద్యార్థులను పొట్టన పెట్టుకునే ప్రయత్నం చేశారన్నది రెండు సంవత్సరాలుగా దాస్తున్న కమిటీ సీల్డ్ కవర్ ఆధారమే బయటపెడుతుందంటూ విద్యార్థులు హెచ్చరిస్తున్నారు. పైగా కమిటీలో ఉన్న ప్రతి సభ్యుడు స్టాండింగ్ కమిటీలో విద్యార్థులకు సీట్లు కేటాయించాలంటూ స్టాండింగ్ కమిటీ పాయింట్ ఏజెండాపై వీసీ రిజిస్ట్రార్లతో సహా సంతకాలు చేసి ఆమోదించి తీరా సీట్ల కేటాయింపు వచ్చేసరికి విద్యార్థులను వేధిస్తూ విద్యార్థులపై నిందలు వేస్తూ విద్యార్థులు పాస్ కాలేదంటే విద్యార్థులకు చదువు రాదంటు ప్రభుత్వం దృష్టిలో విద్యా కార్యదర్శి దృష్టిలో తప్పుడు సమాచారం చేరవేస్తూ విద్యార్థుల జీవితాలపై విద్యార్థులు ఉన్నత విద్యాపై అబద్ధాలతో కూడిన దాడులు చేస్తున్నారన్నది స్పష్టంగా తేలిపోతుంది. పత్రికా సమావేశం సాక్షిగా విద్యార్థులతో బహిరంగ చర్చకు రావాలని పలుమార్లు సవాల్ వేసినప్పటికీ అధికారులు అబద్దాలకు పరిమితమై పోతున్నారు తప్ప విద్యార్థులకు తగిన న్యాయం చేయలేకపోతున్నారని స్పష్టమవుతుంది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇచ్చిన ఉత్తర్వుల కనుగుణంగా విద్యార్థులకు న్యాయం చేయాల్సిన కేయూ అధికారులు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంస్థ ఇచ్చిన ఉత్తర్వులు మాకు పనికిరావు అంటూ మొద్దు బారినతనాన్ని మోరుదోపుతనాన్ని ప్రదర్శిస్తుండడం కేయూ అధికారులకు అబద్ధాల అలవాటు అనేది వెన్నతో పెట్టిన విద్యగా మారిపోతుంది. రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వేలాది పనులతో ఉంటుండగా కేవలం 32 మంది విద్యార్థులపై ఇంత కక్షకట్టడం అది కూడా కేయూ అధికారులే ప్రచారం చేయడం వినడానికి వికారంగా ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో పీహెచ్డీ విద్యార్థులు తలపెట్టిన ఉద్యమం విశ్వవిద్యాలయంలోని దూర విద్యా కేంద్రం ప్రాంతంలో నిర్వహించిన ధర్నాకు సంఘీభావంగా వచ్చి విద్యార్థులకు హామీ ఇస్తూ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వం మీకు తప్పకుండా న్యాయం చేస్తానంటూ ప్రమాణం చేసిన విషయాన్ని ప్రస్తుత ఎమ్మెల్యేలు ఇద్దరు దగ్గర ఉండి విద్యార్థులకు భరోసా కల్పించినప్పటికీ ప్రస్తుతం నేటికీ మూడు సంవత్సరాలు కావస్తుండగా విద్యార్థుల జీవితాలు చిత్రవధను అనుభవిస్తున్నాయి తప్ప అధికారులు నాయకులు విద్యాశాఖ మంత్రి విద్యాశాఖ కార్యదర్శి విద్యార్థుల జీవితాలను నిలువునా ముంచే ప్రయత్నాలు చేస్తున్నారన్నది స్పష్టంగా కనిపిస్తుంది. వందల ఆధారాలు ఉన్న కావాలని వేధిస్తూ కాలయాపన చేయడంలో కేయూ అధికారులంతా గొప్ప మానవతావాదులు తెలంగాణ రాష్ట్రంలోనే లేరనేది స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవైపు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేతా ఐపిఎస్ పేద ప్రజల పట్ల కనపరుస్తున్న సహృదయ భావాన్ని సేవా భావాన్ని అతి దగ్గర సమీపంలో ఉన్న కేయూ అధికారులు ప్రతిరోజు చూస్తూనే కనీసం వాళ్లలో మార్పు రాకుండా ప్రవర్తించడం పైగా అబద్ధాలను అంటిపెట్టుకొని జీవించడం గమనిస్తుంటే కనీసం సిపి నైనా చూసి సిగ్గు తెచ్చుకొండి అంటూ విశ్వవిద్యాలయం మేధావులు కేయూ అధికారులను తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు అబద్ధాలు ఆడుతూ ఆధారాలను దొంగ చాటున దాస్తూ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విద్యార్థుల దృష్టిలో విలన్లుగా చేస్తూ నెలనెలా స్థాయికి మించిన జీతాలు తీసుకుంటున్న ఈ అధికారులు రానున్న ఎమ్మెల్సీ ఎలక్షన్లో కాంగ్రెస్ ప్రభుత్వ పరువును బజారునకీడ్చడం కోసమే ఇంతలా తాపత్రయపడుతున్నారని అందులో భాగంగానే ముఖ్యమంత్రి ఆదేశించిన విద్యా మండలి సంస్థ చైర్మన్ ఆదేశించిన డీన్ స్టాండింగ్ కమిటీల్ ఒప్పుకున్నా దొంగసాకులతో దొంగ కమిటీలు వేసుకొని వాళ్లకు వాళ్లే నిర్ధారించుకొని విద్యార్థులపై విషం కట్టడం ఇదెక్కడి సంస్కృతో ఎవరికీ అంతు చిక్కడం లేదు. భాజాప్త అబద్ధాలు ఆడుతూ విద్యార్థులను రెచ్చగొట్టడం వల్ల వాళ్ళ ప్రాణాలకు ప్రమాదం సంభవిస్తుందని కూడా లేకుండా వాళ్ళ ముందే ఆధారాలను తారుమారు చేస్తూ అబద్దాలకు ఎగబడుతున్న కేయూ అధికారులలు సమస్యపై స్పందించకుండా తప్పుడు మార్గాలను ఎంచుకొని విద్యార్థులను రెచ్చగొడుతున్నారు అన్నది స్పష్టంగా అర్థం అవుతుంది. విద్యార్థులకు న్యాయం చేస్తారా విద్యార్థులను పొట్టన పెట్టుకుంటారా కేయూ అధికారుల తీరు పట్ల యోగితరణ కక్ష సాధింపు చర్యల పట్ల విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి స్పందించి తక్షణమే విద్యార్థులకు న్యాయం చేయాలని పిహెచ్డి ఆశావాహక విద్యార్థులు వేడుకుంటున్నారు. అయ్యా సీఎం రేవంత్ రెడ్డి మాకు న్యాయం చేయండి అంటుదేయ పడుతున్నారు పదేపడుతున్నారు. అదే సందర్భంలో అబద్దాలకోరు అధికారులతో ప్రాణాలు పోయేంతగా విసిగిపోతున్నాం తక్షణమే స్పందించి మమ్మల్ని ఆదుకోండి విజ్ఞప్తి చేస్తున్నారు.

కేయూలో పార్ట్ టైం అక్రమాలపై విచారణ జరపాలి.....

ప్రతిభ" పై" పైరవీల దాడి.....త్వరలో....

గాయపడిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

మర్రి ప్రభాకర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా...
త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

హనుమకొండ, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాలపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మర్రి ప్రభాకర్‌ను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శించారు. ఇటీవల చేయికి గాయమై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ప్రభాకర్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే నాగరాజు ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభాకర్ త్వరగా కోలుకుని సాధారణ జీవితం గడపాలని ఆకాంక్షిం చారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలవడం తన బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటూ, ఆపద సమయంలో భరోసా కల్పిస్తానని తెలిపారు.

2075 నాటికి మానవుడి ఆయుర్దాయం 120 ఏళ్లకు చేరే అవకాశం!

భూగ్రహ శ్రేయస్సుకు శాస్త్రాల సమన్వయం అత్యవసరం - డా. శ్రీవారి చంద్రశేఖర్

పర్యావరణ పరిరక్షణ, వైద్య పరిశోధనలు, ప్రత్యామ్నాయ ఇంధనాలపై దృష్టి సారించాలి

కేయూ క్యాంపస్, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు ఇదే వేగంతో కొనసాగితే 2075 నాటికి మానవుడి ఆయుర్దాయం 120 సంవత్సరాలకు చేరుకునే అవకాశం ఉందని భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి, హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ పూర్వ డైరెక్టర్ డా. శ్రీవారి చంద్రశేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మానవాళి మనుగడ, భూగ్రహ భవిష్యత్తు కోసం అన్ని శాస్త్ర విభాగాల మధ్య సమన్వయం, అంతరశాఖ పరిశోధనలు, పరస్పర చర్చలు తప్పనిసరి అని స్పష్టం చేశారు.కాకతీయ విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన ఫార్మసీ విభాగ విశ్రాంత ఆచార్యులు, విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి. మల్లారెడ్డి గౌరవార్థం నిర్వహించిన తొలి స్మారక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. '2075 నాటికి 120 ఏళ్ల జీవితం -- శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సాధ్యమేనా?' అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో సగటు మానవ ఆయుర్దాయం సుమారు 40 సంవత్సరాలు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం అది 70 సంవత్సరాలు దాటిందని వివరించారు. వైద్య విజ్ఞానం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులు మానవ జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరిచాయని తెలిపారు.అయితే పారిశ్రామిక విప్లవం మానవ జీవితాన్ని సౌకర్యవంతం చేసినప్పటికీ పర్యావరణంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలను చూపిందని పేర్కొన్నారు. గ్లోబల్ వార్మింగ్, శిలాజ ఇంధనాల వినియోగం, పెరుగుతున్న కార్బన్ ఉద్గారాలు ప్రపంచానికి ప్రధాన సవాళ్లుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూగ్రహానికి పెను ముప్పుగా పరిణమిస్తున్నాయని, వాటిని తిరిగి ఉపయోగకరమైన ముడి పదార్థాలుగా మార్చే డీ పాలిమరైజేషన్ ప్రక్రియను ప్రోత్సహించాలని సూచించారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టించే విధానాన్ని విస్తృతం చేయడంతోపాటు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగాన్ని పెంచాలని పిలుపునిచ్చారు.వైద్య రంగంలో వస్తున్న ఆధునిక ఆవిష్కరణలు మానవాళికి కొత్త ఆశలు కల్పిస్తున్నాయని అన్నారు. వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో గణనీయమైన పురోగతి సాధించామని, గుండె శస్త్రచికిత్సలు, స్టెంట్ల వినియోగం వంటి సాంకేతికతలు అనేక ప్రాణాలను కాపాడుతున్నాయని వివరించారు. భవిష్యత్తులో అవయవ మార్పిడి, మూలకణాల నిల్వ వంటి రంగాల్లో మరిన్ని కీలక ఆవిష్కరణలు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. కోవిడ్ మహమ్మారి సమయంలో టీకాలు మానవాళి రక్షణలో కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు.మానవుడు దీర్ఘాయుష్షును కోరుకోవడమే కాకుండా భూగ్రహ భవిష్యత్తు పట్ల కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయం, వైద్యం, ఇంధనం, పర్యావరణ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారాలు కనుగొనే దిశగా జనరేషన్ ఆల్ఫా విద్యార్థులు పరిశోధనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రకృతి పరిరక్షణతో కూడిన శాస్త్ర సాంకేతిక అభివృద్ధే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించగలదని స్పష్టం చేశారు.

జీవనశైలి వ్యాధులపై వీసీ ఆందోళన

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి కారణంగా మానవుల సగటు ఆయుర్దాయం పెరుగుతున్నప్పటికీ, మరోవైపు ఒత్తిడి, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. పర్యావరణ మార్పులు కూడా మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. మానవ ఆయుర్దాయాన్ని నిర్ణయించడంలో జన్యుపరమైన అంశాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఫార్మసీ కళాశాల అభివృద్ధికి, విశ్వవిద్యాలయానికి ఆచార్య వి. మల్లారెడ్డి అందించిన సేవలను కొనియాడారు.రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ.. ఫార్మసీ కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా పూర్వ విద్యార్థుల సహకారంతో బంగారు పతకాలతోపాటు నాలుగు స్మారక ఉపన్యాసాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆచార్య వి. మల్లారెడ్డి, ఆచార్య డి. రాంబాబు, ఆచార్య సి.కె. కోకటే గౌరవార్థం, దివంగత ఆచార్య వై. మధుసూదన్ రావు స్మారకార్థం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.స్మారక ఉపన్యాసాల బాధ్యులు ఆచార్య బి. విజయకుమార్ మాట్లాడుతూ.. ఆచార్య వి. మల్లారెడ్డి వద్ద పరిశోధనలు చేసిన 45 మంది పరిశోధక విద్యార్థులు కలిసి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఒక ప్రధాన అంశంపై వివిధ రంగాల నిపుణులతో ఉపన్యాసాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఆచార్య వి. మల్లారెడ్డి జీవిత విశేషాలను విశ్రాంత ఫార్మసీ ఆచార్యులు ఆచార్య ఎం. సారంగపాణి సభకు పరిచయం చేశారు. అనంతరం ఆచార్య వి. మల్లారెడ్డి దంపతులను విశ్వవిద్యాలయం తరఫున శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ముఖ్య వక్త డా. శ్రీవారి చంద్రశేఖర్‌ను కూడా సన్మానించారు. విశ్రాంత సీనియర్ ఆచార్యులు ఆచార్య ఎస్.ఎం. రెడ్డితోపాటు ఆచార్య వి. మల్లారెడ్డి పరిశోధక విద్యార్థులను జ్ఞాపికలతో గౌరవించారు.డా. కళ్యాణ్ చక్రవర్తి ముఖ్య వక్తను సభకు పరిచయం చేయగా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జె. కృష్ణవేణి వందన సమర్పణ చేశారు. విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి డా. పృథ్వీరాజ్ వల్లాల కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ఆచార్య గార్లపాటి అచ్చయ్య, డీన్ ఆచార్య ఎన్. ప్రసాద్, ఆచార్య వి. కిషన్, ఆచార్య రవీందర్, ఆచార్య సంజీవ రెడ్డి, ఆచార్య సోము శ్రీహరి, ఆచార్య సదానందం, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.

మాతృభాషా అధ్యయనంతోనే విద్యార్థుల మేధో వికాసం

కేయూలో డిగ్రీ తెలుగు పాఠ్యపుస్తకాలు ఆవిష్కరించిన వీసీ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి

భాషా సాహిత్యాల అధ్యయనంతోనే మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాసం

కేయూ క్యాంపస్, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

విద్యార్థుల మేధో వికాసానికి మాతృభాషా అధ్యయనం ఎంతో కీలకమని, వారి సర్వతోముఖాభివృద్ధికి భాషా సాహిత్యాల అధ్యయనం అవసరమని కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలు ప్రశ్నార్థకమవుతున్న తరుణంలో భాషా సాహిత్యాల అధ్యయనం విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడంతోపాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఉపకులపతి కార్యాలయంలో 2026--27 విద్యా సంవత్సరానికి రూపొందించిన డిగ్రీ తెలుగు మొదటి, మూడవ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను వీసీ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. పాలక మండలి సభ్యులు, తెలుగు శాఖ పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు డా. చిర్ర రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాలు విద్యార్థుల్లో మాతృభాష పట్ల అభిమానం పెంపొందించడమే కాకుండా జాతీయ భావన, మానవతా దృక్పథం, నైతిక విలువలను అలవర్చుతాయని తెలిపారు. విమర్శనాత్మక ఆలోచనా శక్తి, సృజనాత్మకతను పెంపొందించడంలో భాషా సాహిత్యాల పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు.రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల తెలుగు శాఖల పాఠ్య ప్రణాళిక సంఘాల సమన్వయంతో ఈ పాఠ్యపుస్తకాలను రూపొందించడం అభినందనీయమని అన్నారు. ప్రొఫెసర్ సి. కాశీం సంపాదకత్వంలో మొదటి సెమిస్టర్ విద్యార్థుల కోసం 'సాహితీ మంజీర', డా. ఎస్. రఘు సంపాదకత్వంలో మూడవ సెమిస్టర్ విద్యార్థుల కోసం 'సాహితీ కిన్నెర' పాఠ్యపుస్తకాలను రూపొందించి ప్రచురించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ సురేష్ లాల్, తెలుగు శాఖ అధ్యక్షులు డా. లింగయ్య, అధ్యాపకులు డా. సదాశివ్, డా. అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయాలంటే అవసరార్థుల వద్దకే వెళ్లాలి

ప్రభుత్వ పథకాలపై పేదలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి

వాజ్‌పేయి కాలనీ అంబేద్కర్ నగర్‌లో పర్యటించిన డా. అనితా రెడ్డి

హనుమకొండ, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

పేదలకు సేవ చేయాలంటే వారు ఉన్న ప్రాంతాలకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు డా. అనితా రెడ్డి అన్నారు.శుక్రవారం హనుమకొండలోని వాజ్‌పేయి కాలనీ అంబేద్కర్ నగర్ స్లమ్ ప్రాంతాన్ని, అక్కడ నివసిస్తున్న గుడిసెవాసుల ఇళ్లను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కుటుంబాల ఆర్థిక, సామాజిక పరిస్థితులను తెలుసుకోవడంతోపాటు పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నారా? ఎవరైనా చదువు మధ్యలోనే ఆపేశారా? బాల్యవివాహాలు జరుగుతున్నాయా? అనే అంశాలపై ఆరా తీశారు.చదువును మధ్యలోనే ఆపివేయడం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే నష్టాలను, బాల్యవివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, జీవితంపై పడే ప్రతికూల ప్రభావాలను స్థానికులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. పిల్లలందరినీ బడికి పంపించాలని, బాల్యవివాహాలను ప్రోత్సహించకుండా వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా ఒంటరి మహిళలకు అందించే సంక్షేమ పథకాలు, వృద్ధాప్య పింఛన్లు, దివ్యాంగుల పింఛన్లపై అవగాహన కల్పించారు. ఆయా పథకాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి? ఎవరిని సంప్రదించాలి? అనే విషయాలను వివరించి, అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పొందేలా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా. అనితా రెడ్డి మాట్లాడుతూ.. సేవ చేయాలంటే ఏసీ హాళ్లలో కూర్చొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మాత్రమే సరిపోదని, నిజమైన అవసరార్థుల వద్దకు వెళ్లి వారి పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. వారి భాషలో, వారికి అర్థమయ్యే విధంగా సంక్షేమ పథకాలు, చట్టాల గురించి వివరించాలని పేర్కొన్నారు.మన ప్రవర్తన ద్వారా వారి పట్ల మనకు నిజమైన శ్రద్ధ, వారి అభ్యున్నతి పట్ల నిబద్ధత ఉన్నాయనే నమ్మకం కల్పించగలిగితేనే ప్రభుత్వ పథకాలు, చట్టాల ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో అర్హులకు చేరుతాయని స్పష్టం చేశారు.అనంతరం స్థానికులకు సేకరించిన దుస్తులను పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డా. అనితా రెడ్డి, ఉంపెందర్ రెడ్డి, రాఘవ, స్థానిక గుడిసెవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ అవకతవకలపై ఢిల్లీకి కాంగ్రెస్ నేతలు

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న నిరసన ర్యాలీ

వరంగల్, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలను నిరసిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న న్యూఢిల్లీలో నిర్వహించనున్న నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు కాంగ్రెస్ నాయకులు బయలుదేరారు.పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి నాయకత్వంలో టీపీసీసీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ మడికొండ శ్రీను, అర్షం అశోక్, నాయకులు బొజ్జం సాయికుమార్, వెలకంటి వరుణ్ కుమార్ తదితరులు ఢిల్లీకి పయనమయ్యారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలను నిరసన ర్యాలీ ద్వారా లేవనెత్తనున్నట్లు నాయకులు తెలిపారు.

కమలాపూర్ సీహెచ్‌సీలో మళ్లీ శస్త్రచికిత్స సేవలు

సిజేరియన్ ప్రసవాలతో పాటు అవసరమైన శస్త్రచికిత్సలు అందుబాటులోకి

కమలాపూర్, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

కమలాపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గత కొన్ని నెలలుగా నిలిచిపోయిన ఆపరేషన్ థియేటర్ సేవలను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలో సిజేరియన్ ప్రసవాలతో పాటు అవసరమైన ఇతర శస్త్రచికిత్స సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. కమలాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆపరేషన్ థియేటర్ సేవలను పునరుద్ధరిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. దీంతో అత్యవసర, ప్రసూతి శస్త్రచికిత్సల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ప్రజలకు కొంతవరకు తగ్గనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. శస్త్రచికిత్స సేవల ప్రారంభం అనంతరం డీసీహెచ్ఎస్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు కమలాపూర్ మీడియా ప్రతినిధులతో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి భవిష్యత్ అభివృద్ధి, వైద్య సేవల బలోపేతం, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు చేపట్టనున్న కార్యాచరణ, భవిష్యత్ ప్రణాళికలను అధికారులు వివరించనున్నారు. ఈ కార్యక్రమానికి కమలాపూర్ ప్రాంతానికి చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై తమ సహకారం, ప్రోత్సాహం అందించాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ సూపరింటెండెంట్ కోరారు. ఆపరేషన్ థియేటర్ సేవల పునరుద్ధరణతో కమలాపూర్, పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో డీసీపీ దారా కవిత వార్షిక తనిఖీ

గంజాయి కేసును ఛేదించిన కానిస్టేబుళ్లకు అభినందనలు

హసన్‌పర్తి, అక్టోబర్ 30(జై భీమ్ క్రైమ్ న్యూస్)

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆమె మొక్కను నాటారు. ఈ సందర్భంగా కాజీపేట డివిజన్ ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్‌లతో కలిసి డీసీపీ స్టేషన్‌లోని వివిధ విభాగాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సన్నిహిత వర్టికల్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు గీత, కోమల, రైటర్ వర్టికల్ సిబ్బంది సుమన్, పూర్ణాచారి, సైబర్ క్రైమ్ వర్టికల్ రాజ్‌కుమార్, టెక్ టీమ్ వర్టికల్ సోమన్న, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వి. రవీందర్, కోర్టు కానిస్టేబుల్ ఈ. రాజేందర్‌ల పనితీరును ఆమె ప్రత్యక్షంగా సమీక్షించారు. నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని, టెక్ టీమ్, సైబర్ క్రైమ్ విభాగాలు మరింత అప్రమత్తంగా పనిచేయాలని డీసీపీ సూచించారు. అలాగే స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు.

గంజాయి కేసు ఛేదించిన కానిస్టేబుళ్లకు అభినందనలు

ఇటీవల హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసును సమర్థవంతంగా ఛేదించి, నిందితులను పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్లు తిరుపతి, వెంకటస్వామి, బావు సింగ్‌లను డీసీపీ దారా కవిత ప్రత్యేకంగా అభినందించారు. వారి అంకితభావాన్ని ప్రశంసిస్తూ భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని డీసీపీ సిబ్బందికి సూచించారు. వర్టికల్స్ వారీగా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ వార్షిక తనిఖీలో హసన్‌పర్తి ఏఎస్ఐ ఆర్. మల్లికార్జున్, హెడ్ కానిస్టేబుళ్లు డి. యాదగిరి, బి. లక్ష్మణ్, ఆర్. శంకర్, బి. మంజుల, క్రైమ్ పార్టీ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 163జీ భూసేకరణకు రైతులు సహకరించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హన్మకొండ, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

ఎన్‌హెచ్ 163జీ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి పరకాల పరిధిలో మిగిలి ఉన్న భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు రైతులు సహకరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కోరారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాతీయ రహదారులు, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి దామెర, శాయంపేట, పరకాల మండలాల పరిధిలోని పలు గ్రామాల రైతులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్ 163జీ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే ప్రాంతీయ అభివృద్ధికి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులకు ఉన్న సందేహాలు, సమస్యలను అధికారులు తెలుసుకుని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వరంగల్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, మేనేజర్ లింగయ్య, పరకాల ఆర్డీవో డీఎస్. వెంకన్న, శాయంపేట, దామెర, పరకాల తహసీల్దార్లు ప్రవీణ్ కుమార్, జ్యోతి వరలక్ష్మి దేవి, విజయలక్ష్మి, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్‌తో పాటు ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై వరంగల్ పోలీసుల ఉక్కుపాదం

107 మందికి డ్రగ్స్ పరీక్షలు.. 29 మందికి పాజిటివ్
17 ద్విచక్రవాహనాలు, 2 కార్లు స్వాధీనం

వరంగల్, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

నేరరహిత వరంగల్, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున ఆటోనగర్, కరీమాబాద్, కాశిబుగ్గ, శంభునిపేట, శివనగర్, ఎల్‌బీ నగర్ ప్రాంతాల్లో విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, పాత నేరస్థులు, డ్రగ్స్ కేసుల్లో ప్రమేయం ఉన్నవారు, అనుమానితులు కలిపి మొత్తం 107 మందిని అదుపులోకి తీసుకుని డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో 29 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ కాగా, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అలాగే సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 17 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, మూడు ఎలక్ట్రిక్ మోటార్ పంపులను నిబంధనల మేరకు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో పిటా చట్టం కింద ఒక కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీ ఎన్. శ్వేత మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుతో పాటు సమాజ భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తుందని అన్నారు. డ్రగ్స్ సరఫరా, విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్ వ్యసనానికి గురైన వారికి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించి సాధారణ జీవనంలోకి తీసుకువచ్చేందుకు కూడా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమంలో భాగంగా పోలీసులు స్థానిక ప్రజలతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం సేకరించారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ప్రతి కాలనీలో కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలు ఇకపై కూడా నిరంతరం కొనసాగుతాయని సీపీ స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగం, విక్రయాలు లేదా ఇతర నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు డయల్ 100, 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వరంగల్ ఇన్‌చార్జ్ ఏసీపీ నరసింహారావుతో పాటు మట్టేవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీ, మడికొండ, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టబోయే ప్రతి బిడ్డకు హెచ్ఐవీ రహిత జీవితమే లక్ష్యం

గర్భిణులకు హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి పరీక్షలు తప్పనిసరి: కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి

హన్మకొండ, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

పుట్టబోయే ప్రతి బిడ్డకు హెచ్ఐవీ వైరస్ సోకకుండా నివారించి, హెచ్ఐవీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయడమే ప్రధాన లక్ష్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి అన్నారు. హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన సమ్మాన్--సమారోహ్, ఈవీటీఎస్ క్లినికల్ ఆడిట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ చర్యలు, గర్భిణులకు నిర్వహిస్తున్న పరీక్షలు, చికిత్సా విధానాలు, తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు గర్భధారణ ప్రారంభ దశలోనే యాంటీనేటల్ కేర్ పరీక్షల్లో భాగంగా హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. వ్యాధులు ఉన్నట్లు గుర్తించిన వారికి సకాలంలో తగిన వైద్య చికిత్స అందించాలని సూచించారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణులకు యాంటీ రిట్రోవైరల్ థెరపీ మందులు క్రమం తప్పకుండా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం నిర్దేశించిన 95-95-95 లక్ష్యాలను సాధించేందుకు వైద్యారోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. హెచ్ఐవీ బాధితులను గుర్తించడం, గుర్తించిన వారందరికీ చికిత్స అందించడం, వైరల్ లోడ్‌ను నియంత్రణలో ఉంచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎయిడ్స్ సురక్ష ప్లస్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ, సిఫిలిస్ వంటి వ్యాధులు సంక్రమించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఏప్రిల్ 2026 నుంచి ఇప్పటివరకు సుమారు 10,296 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు. ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి వచ్చే సమాచారాన్ని కూడా సమగ్రంగా సేకరించాలని, వలస కార్మికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి జిల్లాలో నివసిస్తున్న వారి ఆరోగ్య వివరాలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్ఐవీతో పాటు సిఫిలిస్, హెపటైటిస్-బి, మధుమేహం వంటి వ్యాధుల నియంత్రణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఆరోగ్య సమాచార వ్యవస్థలు, గణాంకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన లక్ష్యాలు, బాధ్యతలు కేటాయించి వారి పనితీరును నిరంతరం సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా జిల్లాను సురక్ష జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన వైద్యాధికారులను కలెక్టర్ జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. హెచ్ఐవీ నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి, పుట్టబోయే ప్రతి బిడ్డకు హెచ్ఐవీ రహిత జీవితాన్ని అందించేందుకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్మోహన్‌రావు, జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డీడబ్ల్యూఓ విశ్వజ, డీఎస్ఓ ప్రోగ్రామ్ ఆఫీసర్ జ్ఞానేశ్వర్, ఎంసీహెచ్ పీవో డాక్టర్ రజిత, ఏఆర్‌టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సూర్యప్రకాశ్, డాక్టర్ రవి, డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

కేవీకే మామ్నూర్‌లో పీఎం కిసాన్ 24వ విడత నిధుల విడుదల ప్రత్యక్ష ప్రసారం

రైతుల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

వరంగల్, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), మామ్నూర్‌లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని శుక్రవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా నిర్వహించారు. ఐసీఏఆర్--పీవీఎన్ఆర్‌టీవీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న పీఎం కిసాన్ 24వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా రైతులకు పీఎం కిసాన్ పథకం ప్రయోజనాలు, వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కేవీకే మామ్నూర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ. రాజు మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహాయం, విడతల వారీగా నిధుల విడుదల, రైతులు పథకం ప్రయోజనాలను పొందేందుకు అవసరమైన అంశాలను వివరించారు. రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఉద్యానవన రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా బంగాళాదుంపల ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభోత్సవం, ఉద్యానవన క్లస్టర్ల ప్రారంభోత్సవం వంటి కార్యక్రమాల ప్రాధాన్యతను కూడా రైతులకు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించడం, ప్రాసెసింగ్ ద్వారా అదనపు ఆదాయం పొందడం, ఉద్యానవన పంటలను క్లస్టర్ విధానంలో సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కిసాన్ మోర్చా ఏరియా అధ్యక్షుడు ఎ. విక్రమ్ రైతులతో మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం రైతులకు అందిస్తున్న ప్రయోజనాలను వివరించారు. రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, వ్యవసాయ పథకాలపై పూర్తి అవగాహన కలిగి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఎఫ్ఎఫ్‌సీఓ ప్రాంతీయ మేనేజర్ విశాల్ మాట్లాడుతూ పంటలకు అవసరమైన పోషకాలను సమతుల్యంగా అందించేందుకు ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని సూచించారు. అధికంగా లేదా అసమతుల్యంగా ఎరువులు వినియోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులను వినియోగించడం ద్వారా పంట దిగుబడులను మెరుగుపరచుకోవచ్చని వివరించారు. ఐఎఫ్ఎఫ్‌సీఓ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య (వ్యవసాయ శాస్త్రం), డాక్టర్ విజయ్ భాస్కర్ (పశుసంవర్ధక శాస్త్రం), డాక్టర్ సాయికిరణ్ (పశుపోషణ), డాక్టర్ జి. గణేష్ (మత్స్యశాస్త్రం), డాక్టర్ ఎ. రాజు (సస్య రక్షణ) పాల్గొన్నారు. వివిధ రంగాలకు సంబంధించిన శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడి పంటల సాగు, పశుపోషణ, మత్స్యరంగం, సస్యరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రైతులు పీఎం కిసాన్ నిధుల విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని ఆసక్తిగా వీక్షించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలు, ఆధునిక సాగు పద్ధతులు, సమతుల్య ఎరువుల వినియోగం, పంటల ప్రాసెసింగ్, ఉద్యానవన క్లస్టర్ల ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన పొందారు. రైతులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడంతో కేవీకే మామ్నూర్‌లో పీఎం కిసాన్ 24వ విడత నిధుల విడుదల కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

కమలాపూర్‌లో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆకస్మిక తనిఖీలు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

కమలాపూర్, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం పలు ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, గురుకుల విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. మొదట కమలాపూర్ మండల కేంద్రంలోని సీహెచ్‌సీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చే ఓపీ రోగుల సంఖ్య, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానం తదితర అంశాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మేల్, ఫిమేల్ వార్డులు, ఓపీ నమోదు విభాగం, టీకాల గది, మెడికల్ రికార్డు విభాగం, మెడికల్ స్టోర్‌ను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని, మందుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం కమలాపూర్ మండలం గూడూరు పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలో సిద్ధం చేసిన భోజనాన్ని, బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినుల డార్మెటరీలు, వాష్‌రూమ్‌లు, పుస్తకాల లభ్యతను పరిశీలించి ప్రిన్సిపల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వంటగది, భోజనశాల, డార్మెటరీలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దోమల నివారణకు మెష్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తదుపరి కమలాపూర్ మండలం గూనిపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారు ముదిగొండ ధనలక్ష్మి ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. గృహప్రవేశం చేసిన ఇంటి నిర్మాణం బాగుందని ధనలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులను అభినందించారు. ఇంటి నిర్మాణ వివరాలతో పాటు ఇంకుడు గుంత, మరుగుదొడ్డి నిర్మాణం గురించి ఆరా తీశారు. మిగతా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కూడా నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే సమయంలో గుడిసెల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యత ఇస్తుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో స్థానిక సర్పంచ్ రాధిక, తహసిల్దార్ సురేష్ కుమార్, వైద్యులు, అధికారులు బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆకస్మిక తనిఖీలు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

కమలాపూర్, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం పలు ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, గురుకుల విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. మొదట కమలాపూర్ మండల కేంద్రంలోని సీహెచ్‌సీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చే ఓపీ రోగుల సంఖ్య, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానం తదితర అంశాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మేల్, ఫిమేల్ వార్డులు, ఓపీ నమోదు విభాగం, టీకాల గది, మెడికల్ రికార్డు విభాగం, మెడికల్ స్టోర్‌ను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని, మందుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం కమలాపూర్ మండలం గూడూరు పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలో సిద్ధం చేసిన భోజనాన్ని, బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినుల డార్మెటరీలు, వాష్‌రూమ్‌లు, పుస్తకాల లభ్యతను పరిశీలించి ప్రిన్సిపల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వంటగది, భోజనశాల, డార్మెటరీలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దోమల నివారణకు మెష్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తదుపరి కమలాపూర్ మండలం గూనిపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారు ముదిగొండ ధనలక్ష్మి ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. గృహప్రవేశం చేసిన ఇంటి నిర్మాణం బాగుందని ధనలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులను అభినందించారు. ఇంటి నిర్మాణ వివరాలతో పాటు ఇంకుడు గుంత, మరుగుదొడ్డి నిర్మాణం గురించి ఆరా తీశారు. మిగతా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కూడా నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే సమయంలో గుడిసెల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యత ఇస్తుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో స్థానిక సర్పంచ్ రాధిక, తహసిల్దార్ సురేష్ కుమార్, వైద్యులు, అధికారులు బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

వరంగల్, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

వరంగల్ జిల్లాలోని 14 పీఎం శ్రీ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు వరంగల్ ఓ సిటీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. ఈ పోటీల్లో 14 బాలికల జట్లు, 14 బాలుర జట్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది బాలికలు, 12 మంది బాలురను రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేశారు. నవంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు వరంగల్ జిల్లా తరఫున పాల్గొననున్నారు. వీరితో పాటు బాలికల జట్టుకు ఒకరు, బాలుర జట్టుకు ఒకరు గైడ్ టీచర్లుగా మొత్తం 26 మంది రాష్ట్ర స్థాయికి వెళ్లనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరీక్షల విభాగం అధికారి కృష్ణమూర్తి హాజరై మాట్లాడుతూ.. క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందని అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ వరంగల్ జిల్లా జట్లు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

బాలుర విభాగంలో మోడల్ స్కూల్ పర్వతగిరి జట్టు ప్రథమ స్థానం సాధించగా, ప్రభుత్వ పాఠశాల నర్సంపేట జట్టు ద్వితీయ స్థానం సాధించింది. బాలికల విభాగంలో తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల నెక్కొండ జట్టు ప్రథమ స్థానం, మోడల్ స్కూల్ బుధరావుపేట జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి అనిల్ కుమార్, జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నెం వెంకటేశ్వర్లు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ పుల్ల సుధాకర్, గేమ్స్ కన్వీనర్ నాగరాజు, రవీనా, రవీందర్ తదితర వ్యాయామ ఉపాధ్యాయులు, గైడ్ టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత, గిరిజన జర్నలిస్టులపై దాడులు చేస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమమే

నవంబర్ 25న రాష్ట్ర మహాసభలు.. ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది తరలిరావాలి

పెద్దపల్లి, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

దళిత, గిరిజన జర్నలిస్టులపై దాడులు, వివక్షను సహించబోమని, జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకునే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని పద్మిని హోటల్‌లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాదేపురం గంగన్న అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, వివక్షను తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ముఖ్యంగా పోలీసులు ఇటువంటి చర్యలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. ఇటీవల సిరిసిల్లకు చెందిన ఇద్దరు జర్నలిస్టులపై సిరిసిల్ల పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమని, ఈ ఘటనకు బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన జర్నలిస్టులను ఐక్యం చేసి, జిల్లా కమిటీలు లేని ప్రాంతాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కమిటీల నిర్మాణం పూర్తయిన అనంతరం నవంబర్ 25న రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది జర్నలిస్టులు తరలివచ్చి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో అర్హులైన దళిత, గిరిజన జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందని, అక్రిడిటేషన్ కమిటీల్లో వారికి తగిన ప్రాతినిధ్యం లేకపోవడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, ఇంటి స్థలాలు కల్పించే వరకు రాష్ట్ర కమిటీ పోరాటాన్ని ఆపబోదని స్పష్టం చేశారు. ఈ సమస్యలపై ఇప్పటికే రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడించినప్పటికీ ప్రభుత్వ విధానంలో మార్పు రాలేదని విమర్శించారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి తమ వైఖరిని మార్చుకుని దళిత, గిరిజన జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి, తెడ్డు సాయిలు, చుంచు బాబు, సంయుక్త కార్యదర్శి ఈరోల్ల పురుషోత్తం, ఆర్గనైజింగ్ కార్యదర్శి అరుణ్, ఉత్సవ కమిటీ రాష్ట్ర చైర్మన్ సంతోష్, కో-కన్వీనర్ సురేష్, నాయకులు వెంకన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ వరంగల్‌లో జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం 'సమ్శోధిని'26 ప్రారంభం

వరంగల్, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

కిట్స్ వరంగల్‌లో జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం 'సమ్శోధిని'26 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కిట్స్ వరంగల్‌లోని ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ విద్యార్థి విభాగం, సాంకేతిక క్లబ్, విద్యార్థి కార్యకలాపాల కేంద్రం, 11 విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 30, 31 తేదీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కిట్స్ వరంగల్ సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ ముఖ్య అతిథిగా, టీసీఎస్ విద్యా భాగస్వామ్యాల హైదరాబాద్ ప్రాంతీయ అధిపతి రిచర్డ్ కింగ్ చత్రగడ్డ గౌరవ అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పాటు సంభాషణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలపై పటిష్టమైన అవగాహనతో పాటు సమస్యలను పరిష్కరించే ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని అన్నారు. వినూత్న ఆలోచనలు, పరిశోధనలు, ప్రారంభ సంస్థల ద్వారా విద్యార్థులు భవిష్యత్‌లో మంచి సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. రిచర్డ్ కింగ్ చత్రగడ్డ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే నైపుణ్యం విద్యార్థులకు ఎంతో అవసరమని అన్నారు. ఉద్యోగం పొందేందుకు విద్యార్హతలతో పాటు వాస్తవిక నైపుణ్యాలు కూడా కీలకమని తెలిపారు. నిరంతరం సాధన చేస్తూ కొత్త విషయాలను నేర్చుకోవాలని సూచించారు. కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ 'సమ్శోధిని'26కు 'సాంప్రదాయ ఆలోచనలకు అతీతంగా' అనే అంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా ఎంచుకున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిశోధన, సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాలు, ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో సాంకేతిక వర్క్‌షాప్‌లు, పరిశోధనా పత్రాల ప్రదర్శనలు, ప్రాజెక్టుల ప్రదర్శన, నూతన ఆవిష్కరణల కార్యక్రమాలతో పాటు 50కి పైగా సాంకేతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కిట్స్ వరంగల్ అదనపు కార్యదర్శి వి. సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో విద్యను అభ్యసించడంతో పాటు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కొత్త ఆలోచనలను ఆవిష్కరణలుగా మార్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 52 కళాశాలలకు చెందిన 1,700 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం సింపోజియంలో సుమారు 4,500 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కిట్స్ వరంగల్ యాజమాన్య సభ్యులు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థి సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలి

శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నివేదికలు సమర్పించాలి: కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

జిల్లాలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎల్‌నినో ప్రభావంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల కలిగే వాతావరణ మార్పులు, వ్యవసాయ రంగంపై పడే ప్రభావం, నీటి లభ్యత తదితర అంశాలపై ప్రజలకు, ముఖ్యంగా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి, తీసుకోవాల్సిన ముందస్తు నివారణ చర్యలతో కూడిన నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు, పంటల నిర్వహణ, ముందస్తు జాగ్రత్తలపై స్పష్టమైన సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్, గ్రౌండ్‌వాటర్, పశుసంవర్ధక శాఖలు రూపొందించే కార్యాచరణ ప్రణాళికల ఆధారంగా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి (టీఎస్ఎస్) కళాకారులు ఎల్‌నినోపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన పాటల సీడీని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆవిష్కరించారు. తూర్పు నియోజకవర్గం టీమ్ లీడర్ జూపాక శివ, గౌరారపు యుగంధర్ తమ కళాబృందంతో రూపొందించిన పాటల ద్వారా ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, రైతులు పాటించాల్సిన వ్యవసాయ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. కళాకారులు గ్రామీణ ప్రాంతాల్లో పాటల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్. కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ వై.వి. గణేష్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ ఆనందం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ పిలుపు మేరకు 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు..

నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటంలో పాల్గొనేందుకు సిద్ధం

ఐనవోలు : (జై భీమ్ న్యూస్)

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పిలుపు మేరకు నవంబర్ 1వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమంలో పాల్గొనేందుకు వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, టీపీసీసీ ఉపాధ్యక్షులు నామిండ్ల శ్రీనివాస్ లతో కలిసి ఢిల్లీకి పయనమయ్యారు. దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల సంరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ఓటు హక్కు పరిరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఈ ఉద్యమంలో భాగస్వాములు కావడానికి ఎమ్మెల్యే నాగరాజు ఢిల్లీకి బయలుదేరారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత విలువైన హక్కు అని,ఆ హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ప్రజల ఓటు హక్కుకు భంగం కలగకుండా, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించే దిశగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ గళాన్ని వినిపించనున్నారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగుతున్న పోరాటంలో వర్ధన్నపేట నియోజకవర్గం తరఫున ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి వందల మంది నాయకులు, కార్యకర్తలు తరలి వస్తున్నారని అన్నారు.

అవసరార్థుల వద్దకే వెళ్లి సేవ చేయాలి

అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి

హన్మకొండ, అక్టోబర్ 30 (జై భీమ్ న్యూస్)

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించాలంటే అవసరార్థుల వద్దకే వెళ్లి వారికి అర్థమయ్యే రీతిలో వివరించాలని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు.హనుమకొండలోని వాజ్‌పేయి కాలనీ, అంబేద్కర్ నగర్ స్లమ్ ప్రాంతాలతో పాటు గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలను డాక్టర్ అనితా రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాల్లోని పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నారా, ఎవరైనా చదువు మధ్యలోనే మానేశారా, 18 ఏళ్లలోపు బాల్యవివాహాలు జరుగుతున్నాయా అనే అంశాలను అడిగి తెలుసుకుని పరిస్థితులను పరిశీలించారు. చదువుకు దూరం కావడం వల్ల కలిగే నష్టాలను, బాల్యవివాహాల వల్ల ఎదురయ్యే సమస్యలను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. అలాగే ఒంటరి మహిళల పథకాలు, వృద్ధాప్య పెన్షన్, దివ్యాంగుల పెన్షన్ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. పథకాలను పొందేందుకు ఎవరిని సంప్రదించాలి, ఎలా దరఖాస్తు చేసుకోవాలి అనే విషయాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు పేదలు, అవసరార్థులకు చేరాలంటే ఏసీ హాళ్లలో కూర్చొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మాత్రమే సరిపోదన్నారు. అవసరంలో ఉన్న వారి వద్దకు వెళ్లి, వారికి అర్థమయ్యే భాషలో విషయాలను వివరించాల్సిన అవసరం ఉందన్నారు. వారి మంచి కోరుతున్నామనే భావన కలిగేలా మన ప్రవర్తన ఉండాలని, అప్పుడే మంచి పథకాలు, చట్టాలు సమర్థవంతంగా అమలై వాటి ఫలాలు అర్హులకు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం స్లమ్ ప్రాంతాల్లోని కుటుంబాలకు సేకరించిన దుస్తులను పంపిణీ చేశారు. శరీర పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉంపెందర్ రెడ్డి, రాఘవ్‌తో పాటు గుడిసెవాసులు పాల్గొన్నారు.

వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి

నీటి వనరులను సంరక్షిస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి: అదనపు కలెక్టర్ రవి

హసన్‌పర్తి, అక్టోబర్ 30(జై భీమ్ న్యూస్)

రైతులు భూసారాన్ని కాపాడటంతో పాటు నీటి వనరులను సంరక్షిస్తూ స్థిరమైన, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని అదనపు కలెక్టర్ రవి సూచించారు. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ సందరాజు లావణ్య అధ్యక్షతన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని నేల స్వభావానికి అనుగుణంగా సమతుల్య ఎరువులు వినియోగించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడంతో పాటు పంటల మార్పిడి, చీడపీడలు, తెగుళ్ల నివారణపై అవగాహన పెంచుకోవాలన్నారు. యాసంగిలో ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాల తగ్గుదల, విద్యుత్ అంతరాయాలను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులను కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పంట కొయ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చవద్దని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతు సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ నీటి లభ్యతను బట్టి ఆయిల్‌పామ్, కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. నీటి కొరతను అధిగమించేందుకు వరికి ప్రత్యామ్నాయంగా వేరుశెనగ, పొద్దుతిరుగుడు, పెసర, మినుము, అలసంద, జొన్న తదితర పంటలతో పాటు కూరగాయలను సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఆది రెడ్డి, టికేవీకే శాస్త్రవేత్త నర్సయ్య, డీఎం టీజీ ఆయిల్ ఫెడ్ శంకర్, మండల వ్యవసాయ అధికారి అనురాధ, ఏఈ తరుణ్, వీఏఎస్‌లు దీపిక, రమేష్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగళ్లపెల్లి తిరుపతి, సర్పంచ్ సందరాజు లావణ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు శైలజ, సాయి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు ఇస్తే చర్యలు తప్పవు!

అభివృద్ధి పనులపై కమిషనర్ ఆకస్మిక తనిఖీలు
నిబంధనలు ఉల్లంఘిస్తే కాంట్రాక్టర్ల బిల్లులకు కోత

వరంగల్, 30 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

గ్రేటర్ వరంగల్ నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై బల్దియా యంత్రాంగం దృష్టి సారించింది. పనుల్లో నిర్లక్ష్యం, నాణ్యతా లోపాలు, గడువు దాటిన జాప్యాన్ని సహించేది లేదని బల్దియా కమిషనర్ టి. వెంకన్న స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టినా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయకపోయినా సంబంధిత కాంట్రాక్టర్ల బిల్లుల్లో కోత విధిస్తామని హెచ్చరించారు.నగరంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న, పూర్తయిన అభివృద్ధి పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాజీపేట సర్కిల్ పరిధిలోని పోతరాజుపల్లి, ఉర్దూ వాడ, తోట మైదానం, గిర్మాజిపేట, చార్‌బౌలి, లక్ష్మీపురం మార్కెట్ ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల పురోగతిని సమీక్షించారు. వరంగల్ చౌరస్తా వద్ద చేపట్టిన ఫుట్‌పాత్ నిర్మాణ పనులను సైతం తనిఖీ చేశారు.అలాగే కాజీపేట సర్కిల్ పరిధిలోని బంధం చెరువు, కాజీపేట దర్గా సమీపంలో, పిస్తా హౌస్ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. శాయంపేటలో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతోపాటు ఉర్దూ వాడలో నిర్మాణంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని సందర్శించి పనుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజాధనంతో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణంలో ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే తక్షణమే సరిదిద్దాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.నగరాభివృద్ధిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ సూచించారు.ఈ పర్యటనలో ఈఈలు సంజయ్ కుమార్, రవికుమార్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.